ప్రజాశక్తి

Vol. 1, no. 7

(Jul. 29, 1942)

బెజవాడ, 1942

Prajāśakti

Vol. 1, no. 7

(Jul. 29, 1942)

Bejavāḍa, 1942

Record no. 683

10 పేజీలు: 0-1-6 | PRAJA SAKTI | Regd. No. M. 4486

చందావివరాలు	
సం॥ చందా	4-0-0
అర్ధసం॥ ,,	2-0 0
విడిప్రతి	0-1-6

ప్రజాశక్తి

అడ్వర్ టైజు మెంటు రేట్లు	
పూర్తిపేజి	35-0-0
అర పేజి	18-0-0
పావు పేజి	10-0-0
కాలం అంగుళం	0-12-0

అంతర్జాతీయ పార్టీశాఖ
భారత కమ్యూనిస్టు పార్టీ
ఆంధ్ర కమిటీ పత్రిక

సంపాదకవర్గం:
మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు) : : కంభంపాటి సత్యనారాయణ
తుమ్మల వెంకటామిమయ్య : : చలసాని వాసుదేవరావు

సంపుటి 1 | బుధవారం 29-7-42 బెజవాడ | సంచిక 7

★ వర్కింగ్ కమిటీకి
భారత కమ్యూనిస్టుపార్టీ బహిరంగ లేఖ

కామ్రేడ్స్,

మన ప్రాచీనదేశపు చరిత్రలో నేడొక ప్రమాదస్థితి యేర్పడింది. ఒక విదేశీ సామ్రాజ్యవాద నిరంకుశవిధానం మన భారత ప్రజాబాహుళ్యాన్ని సంకెళ్ళలో బంధించివేసి. దేశాన్ని పరిపాలించే ప్రభుత్వంగా తాండవమాడుతోంది. తూర్పుదిశ నుంచీ, పశ్చిమదిశ నుంచీ, విదేశీయులు మన దేశంపై దండయాత్ర చేయ సిద్ధంగా వున్నారు. మన దేశానికి తూర్పున చైనా ప్రజలు వీరయోధులై చేస్తున్న ప్రతిఘటన, పశ్చిమంలో సోవియట్ ప్రజలు ధైర్యసాహసాలతో చేసే ప్రతిఘటన, నేడు ఫాసిస్టు దండయాత్రను అడ్డుకొంటున్నాయి. ఇదే విధంగా వారు తమతమ మాతృదేశాలను రక్షించుకోవడానికి పోరుసల్పుతూ, మన దేశాన్ని కూడా రక్షించుతున్నారు. రేపో మాపో ఎంతో స్వల్పకాలంలోనే, మనం కూడా మన మాతృదేశం యెడల మన కర్తవ్యాన్ని నెరవేర్చవలసిన సమయం వస్తుంది.

మా విజ్ఞప్తి

గర్వించ దగిన మన జాతీయోద్యమానికి మీరు గౌరవించ దగిన నాయక మణులు. మనయోధుల రక్తంతో నిర్మించబడి, అసంఖ్యాకమైన ప్రజలచే బలపరచ బడుతూన్న కాంగ్రెసు మహాసంస్థకు మీరు నేతలు. 50 సంవత్సరాలుగా వృద్ధిపొందుతూన్న మనస్వాతంత్ర్యోద్యమాన్ని నడిపించ వలసిన మహాభారం మీభుజస్కంధాల మీద ఉంది. కమ్యూనిస్టులమైన మా రాజకీయ జీవితం 15 సంవత్సరాలుగా వృద్ధిపొందుతూ వచ్చింది. విశాలమైన జాతీయోద్యమంలోనే మేముకూడా జన్మించాము. దాన్ని బలపరచడానికి మాశక్తినంతటినీ వినియోగించాము. కాంగ్రెసు సభ్యులమని చెప్పుకోడానికి మేము గర్వపడతాం. మన జాతీయ సాంప్రదాయానికి అదొక అమూల్యమైన ఆభరణం. సహచరులైన మాయితర దేశభక్తులందరితోను చేయిచేయికలిపి, భారత దేశపు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడానికి ఈ కాంగ్రెసు సభ్యత్వం మాకు ఉత్సాహాన్నియిస్తుంది.

దేశానికి నేడు సంభవించిన మహా విపత్సమయంలో మీరొక పంథాను చూపిస్తున్నారు. మామనస్సులో వున్నభావాలను మీకు వెల్లడిచేయడం మా కర్తవ్యం అని భావిస్తున్నాం. మీరు, స్వాతంత్ర పోరాటంలో పాల్గొనే మాయితర మిత్రులు మేము చెప్పేవిషయాలు వినేటట్లు చెయ్యడం మాహక్కుగా భావిస్తున్నాం.

జాతీయనాయకత్వంలో చీలిక

ప్రస్తుతపు కార్యాచరణవిధానాన్ని మీరు దేశానికి అందజేయడానికి ముందు జాతీయ నాయకత్వంలోనే చీలిక యేర్పడింది. ఇది ఏ దేశాభిమానికీ తెలియని రహస్యం కాదు. జపాను సైన్యాలు ఇండియాకు రావనీ, జపానువారితో గౌరవప్రదమైన శాంతి సాధ్యం అవుతుందనీ, ఎక్కువగా గౌరవించబడే మన నాయకుడు గాంధీజీయే భ్రమించాడు. జాతీయ ప్రతిఘటన అర్థంలేనిది అంటూ ఆయన అనుచరులు ఖండించసాగారు. దేశాన్ని రక్షించాలనీ, జాతీయ ప్రభుత్వముకొరకు పోరాడాలనీ కబుర్లుచెప్పే కాలం అంతరించిందంటూ వారు వాదించారు. కాని నెహ్రూ పండితుడు, మౌలానా అజాదు, మరికొందరు, పైవారిని ఒప్పించగలిగినందున స్వవినాశకరమైన ఈ విధానం నిరాకరించబడినందుకు మేము సంతోషిస్తున్నాము.

జాతీయ నాయకత్వములో యీ అపజయ భీతికలవారు పరాజయ మొందినందుకు మేము సంతోషిస్తున్నాము.

భారత దేశం తనను తాను రక్షించుకోవాలి, భారత దేశం పేసిస్టు దురాక్రమణను యెదుర్కోవాలి, భారత దేశం మిత్రదేశాలతో కలిసి పోరాడాలి, భారత దేశపు రక్షణను సంఘటిత పర్చడానికి అధికారం కావాలి, భారత దేశం స్వాతంత్ర్యము కొరకు పోరాడటానికి స్వేచ్ఛను కలిగియుండాలి.

అనే నిర్ణయాలకు మీరంతా ఏకగ్రీవంగా రావడం మాకు సంతోషాన్ని కలుగ జేసింది.

ఆచరణ యోగ్యమైన కార్యక్రమం కాదు

కాని. మీరిచ్చిన కార్యక్రమం ఆచరణ యోగ్యమైనది కానందుకు మేము బాధపడుతున్నాం. ప్రజలు ఏకర్తవ్యాలను నెరవేర్చవలసిందిగా మీరు ఆదేశించారో వాటిని ఏదేశాభిమాని నెరవేర్చ జాలడని మానిశ్చితాభిప్రాయం. అంతేకాదు. వాటికి వ్యతిరేకమైన ఫలితాలుకూడా సంప్రాప్తించవచ్చు.

మనదేశ ప్రజలను బానిసత్వంలో ముంచుతూ ఫేసిస్టు దురాక్రమణ దారులను అడ్డగించడానికి శక్తిలేనట్టియు. మన మాతృదేశాన్ని మనం రక్షించుకోవడానికి ఆటంకాలు కలుగజేసేటట్టియు, సామ్రాజ్యవాద నిరంకుశత్వం వైపు వేలుపెట్టి మీరు చూపడం సరియైనదే. కాని, ఫాసిస్టులతో పోరు సల్పేముందు వీరితోనే పోరుసల్పుదాం అని మీరంటారు.

సామ్రాజ్యవాద నిరంకుశత్వం పోవాలి అనీ మన దేశాన్ని వారు రక్షింపజాలరనీ, మలయా బర్మాలలో మాదిరి మనల్ని కూడా చేతులు కాళ్లు కట్టివేసి ఫాసిస్టు దుండగీండ్రకు మనల్ని ఒప్పజెప్పుతారని, మీరు చెప్పడం సరిగానే వుంది. అయితే అధికార పదవులలో నుంచి వారిని కిందికి తన్నడం ఎలాగు? మన దేశాన్ని పరిపాలించే యీ ప్రభుత్వపు అధికారాన్ని లాగుకొనడం ఎలాగు? ఇందుకు ఒక్కటే మార్గం వుంది, మన దేశంయొక్క బలాన్నంతటినీ సంపూర్ణంగాను, వేగంగాను, మనం సమీకరణ మొనర్చాలి. మనం నేడు బానిస స్థితిలో ఉన్నాం. కాబట్టి జాతీయైక్యత అనే రూపంలో యిది వెల్లడి అవుతుంది. సామ్రాజ్యవాద నిరంకుశత్వముతో మనం జరిపే పోరాటం, జాతీయైక్యత కొరకు మనం జరిపే పోరాటం, రెండూ ఒకటే. మన దేశీయుల జాతీయ సంస్థలన్నింటిచేతను బలపరచబడే కాంగ్రెసు - ముస్లిం లీగు ఐక్యతకై మనం పాటుపడదాం, ఏనాడుమనం జాతీయైక్యతను పూర్తిగా సాధించ గల్గుతామో ఆరోజునే సామ్రాజ్య వాదనిరంకుశవర్గం మాయమవుతుంది. ఆరోజునే జాతీయ ప్రభుత్వం స్థాపించుకొనగలం. స్వాతంత్రము కొరకు ఐక్యత! ఈనినాదాన్ని మీరే మనజాతీయోద్యమాని కంతకూ కీలకంగా చేశారు. ఈ రోజున మాత్రం మీరు, మొదట స్వాతంత్ర్యం వస్తే తరువాత ఐక్యత వచ్చితీరుతుంది. అంటున్నారు!

స్వాతంత్ర్యం ఒకరు మనకు ప్రసాదించే వస్తువా? అలా అను కోవడం వట్టి భ్రమ. దానికై మనం పోరుసల్పి సంపాదించు కోవాలి, ఇప్పుడే కాదు, ఎల్లప్పుడూ అంతే. ఈ రోజున స్వాతంత్ర్యం కొరకు పోరుసల్పడం అంటే అర్థం, మన జాతీయైక్యతకై రాత్రింబగళ్లు కృషిచేయడం అన్నమాట. ఇది అసాధ్యమైన పని అంటూ మీరు దీన్ని విడనాడు తున్నారు. అయితే, నిరంకుశ వర్గాలను వదుల్చు కోడానికీ, జపాను దండ యాత్రను ఎదుర్కొన డానికి, యిదొక్కటే మార్గం. చైనా సైన్యాలు, సోవియటు సైన్యాలు, యిస్తూన్న అమూల్యమైన వ్యవధిని వినియోగించు కోడానికి యిదొక్కటే మార్గం. దానిని మీరు నిరాకరించారు!

"మాదేశం విడిచి మీదేశం వెళ్లిపోండి"

మాదేశాన్ని విడిచి పెట్టి మీదేశం వెళ్లిపొండి అంటూ మీరు బ్రిటిషు నిరంకుశాధికారుల్ని హెచ్చరించారు. మర్యాదగల పెద్దమనుష్యుల మాదిరిగా వారు వెళ్లిపోతారనీ, మన ప్రజల్నివారు బానిసత్వంలో నుంచి తప్పించు తారనీ, మీరు ఆశలతోనిండియున్నారని మేము ఎన్నటికీ అనము. అవిధంగా మేము మీ కుశాగ్రబుద్ధిని అగౌరవ పరచము. అయితే వారు భారత దేశాన్ని భారతీయులకే విడిచిపెట్టి పోతారని మరేలాగు మీరు ఆశించుతున్నారు? మిత్ర రాజ్యాల ప్రజలు యీ విషయంలో కలుగజేసుకొంటారని మీ ఆశ. ఇది స్పష్టంగా తెలుస్తోంది. మా పనిని మీరు చేసిపెట్ట వలసిందంటూ వారిపైననే భారం అంతా వెయ్యడం మీ జాతీయ ఆత్మ గౌరవానికీ, మా జాతీయ గౌరవానికీ నష్టం కాదా?

(మిగతా 4 వ పేజీలో)

ప్రజాశక్తి

29-7-42 బుధవారం

కమ్యూనిష్టులు; కాంగ్రెసు

"వార్ధా తీర్మానం ప్యాసయితే కమ్యూనిష్టులు కాంగ్రెసుతో పోరాడుతారు" అనీ, "కాంగ్రెసు నుంచి కమ్యూనిష్టులు నిష్క్రమించుతారనీ" వార్తలు చెలరేగుతు న్నాయి. న్యూఢిల్లీ ఉద్యోగులు అందు కొరకు ఎదురు చూస్తున్నారు. సర్ ఫిరోజ్ ఖాన్‌నూన్ పొగరుబోతుతనం ఉట్టిపడే ఉపన్యాసంలో లాయలిష్టు ఏజంట్లు మినహా అందరూ 'అచ్చమైన ఫాసిష్టులని' తిట్టాడు. కమ్యూనిష్టులు 'మంచి పిల్లలు'వలె ప్రవర్తించుతారని ఆశించాడు.

ఈ నిరంకుశాధికారులు ఏమికోరుతున్నారో తెలసికోడం సులభమే. మన దేశ ప్రజల సంఘటిత బలానికి ప్రతినిధి అయిన కాంగ్రెసును ఒంటరిగాచేసి, అణచి వేయాలని వారు ఆశించుతున్నారు. ప్రభుత్వోద్యోగులకు ప్రజలంటే తగని భయం. వారు భారత ప్రజలతో సంబంధం లేకుండానే ఇండియాను రక్షించాలనే భ్రమలో వున్నారు. కాంగ్రెసులో చీలికలు గల్గించి, అణచివేసి భారత ప్రజలను లొంగదీయ కోరుతున్నారు. దేశంలో వున్న పదవుల రాయుళ్ళను, దేశ ద్రోహులను, రాజకీయ అవకాశ వాదులను ప్రోగుచేసి కాంగ్రెసుకు వ్యతిరేకంగా ఒక ముఠాను నిర్మించ కోరు తున్నారు. అధికారుల యీ గ్రుడ్డి పోకడలే దేశరక్షణ కార్యాలను నిజంగా కుంటు పరుస్తున్నాయి. అనగా ఆచరణలో జపాను దుండగీడులకు సాయపడుతున్నాయి. అంతేగాక యీ నిరంకుశాధికారులు తాము చేసిన నేరాలకు మన ప్రజలపైనను, వారిజాతీయ సంస్థ అయిన కాంగ్రెసుపైనను నిందలు వేస్తున్నారు.

మేము అధికారుల దురాశలను మన్నించజాలము. కాంగ్రెసునుండి వెడలి పోము. మేము భారత ప్రజల బిడ్డలము. ప్రజల జాతీయ సంస్థయగు కాంగ్రెసు లోపలనే వుండటం మాజన్మహక్కు. కాంగ్రెసు వాదులందరికి ప్రస్తుత కర్తవ్యాన్ని గురించి నచ్చచెప్పడానికి మా శక్తికొలది ప్రయత్నించుతాము. నేడు గాకున్నా భవి ష్యత్తులో మేము తప్పక జయించి తీరుతాము. యావత్ భారత ప్రజలు మాపంథాను అనుసరించుతారు. అఖిల భారత కాంగ్రెసు కమిటీలో మేము ఓడిపోయినా ఫర్వా లేదు. తరువాతనయినా దేశభక్తులందరిలో ఉత్సాహాన్ని రేకెత్తింపజేసి మాతృదేశ రక్షణకు ఐకమత్యంతో పూనుకునేటట్లు చేయగలుగుతాము. కమ్యూనిష్టులమగు మేము భారత దేశాన్ని రక్షించడానికి, స్వాతంత్ర్య సాధనకొరకే యుద్ధంలో పాల్గొన కోరుతున్నాము. విదేశ నిరంకుశాధికారులు మనపై పెత్తనం చేస్తున్నప్పటికీ, మనం యీ కర్తవ్యాన్ని నెరవేర్చాలి. జపాన్ దుండగీడులు మన దేశంపై దూకడానికి సిద్ధంగావున్న యీ సమయంలో భారత ప్రజలలో సంపూర్ణ ఐక్యత కావాలి. మనకు ప్రియమైన మాతృభూమిని, మన సంపదలను రక్షించుకోడానికి దేశభక్తులందరిలోనూ ఐక్యత కావాలి. నిరంకుశాధికారులు తమకు సహజమైన సంకుచిత బుద్ధితో మన దేశభక్తుల మధ్యవున్న ఐక్యతను నాశనం గావించాలని చూస్తున్నారు. కాని వారి కోర్కెలు యీడేరవు. మేము కాంగ్రెసు ఐక్యతను కాపాడటానికి పోరాడుతాము; దానిని విస్తరింపజేసి, నిరంకుశాధికారుల పెత్తనాన్ని నాశనంగావించి, నిజమైన జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించడానికి కృషిచేస్తాము,

రెండోవైపున కాంగ్రెసు నాయకత్వం కమ్యూనిష్టులను "కాంగ్రెసును ఎదిరించుతున్నారని" నిందించుతోంది. కాంగ్రెసునుండి మమ్ములను వెళ్ళిపొమ్మంటూ వుంది. 'డిసిప్లినరీచర్య' తీసుకొంటారని బెదిరించుతున్నారు. కాంగ్రెసు నాయ కత్వం అవలంబించే అర్థంలేని యీగ్రుడ్డి పంథా బ్రిటీషు నిరంకుశాధికారులకు మాత్రమే లాభపడుతుంది. మన కాంగ్రెసునాయకులు యీ సత్యాన్ని తెలిసికోలేక పోతున్నారు. మనదేశ ప్రజలందరిని ఐక్యపరచడానికి బదులు వారు వున్న ఐక్యతనే విచ్ఛిన్నం చేస్తున్నారు. భారతదేశ చరిత్రలో క్లిష్టమైన యీ సమయంలో కాంగ్రె సులో చీలికలు తేవడం, బలహీన పరచడం అంటే రక్షణలేని యావత్ భారతప్రజ లను వినాశకరంగా ప్రవర్తించే నిరంకుశోద్యోగులకు అప్పగించడమన్న మాట; వారు ఎలాగు రక్షించలేరు గాన జపాన్ దుండగీడులకు ఆచరణలో వప్పగించడ మన్నమాట. దేశద్రోహులు యీ పనిని చేయడానికే విశ్వప్రయత్నం చేస్తున్నారు. సర్ ఫిరోజ్‌ఖాన్‌నూన్ మమ్ములను కాంగ్రెసునుండి బయటికి రమ్మంటున్నాడు: కాంగ్రెసునాయకులు అదేపని చేయమని రెచ్చగొడుతున్నారు. నేడు కాంగ్రెసు ఐక్యత, జాతీయ ఐక్యత అత్యంత అవసరం. జపాన్ ఫాసిస్టు దుండగీడులను ఎదిరించడానికి, విదేశ నిరంకుశాధికారులను ఎదుర్కోడానికి భారతప్రజలకున్న ఆయుధం ఐక్యత ఒక్కటే. కాని కాంగ్రెసునాయకత్వం నేడు అవలంబించుతున్న పాలసీ దేశభక్తులలో చీలికలు తెస్తుంది; ప్రజలలో విభేదాలను కలిగించుతోంది.

ఆత్మ హత్యాకరమైన యీ పాలసీని చూచి కమ్యూనిష్టులమగు మనం రెచ్చగూడదు. మేము కాంగ్రెసు ఐక్యతకోసం కాంగ్రెసు ముస్లింలీగ్ ఐక్యత కోసం పోరాడుతాము. యావత్ భారతప్రజల ఐక్యతను స్థాపించుటద్వారా బ్రిటీషు సామ్రాజ్యవాదులనుండి జాతీయ ప్రభుత్వాన్ని గుంజుకోడానికి పోరాడుతాము. కాంగ్రెసునాయకత్వం తేనున్న 'పోరాటం' ప్రజలలో చీలికలు కలుగజేస్తుంది. కాబట్టి నిరంకుశాధికారుల చేతులను బలపరుస్తుంది. కాబట్టి దానిని వ్యతిరేకించుతాము. ఏమంటే గాంధీజీ తేనున్న ఉద్యమం ప్రజలను రక్షణలేని నిస్సహాయులను గావించు తుంది. జపాన్ దురాక్రమణదారుల పని సులభం చేస్తుంది. అది స్వాతంత్ర్యం తేలేదు సరిగదా, జపాన్ దుండగీడులకు ఆహ్వానమవుతుంది,

కాంగ్రెసు గొప్ప సాంప్రదాయాలను కాపాడవలసిన బాధ్యత మామీదపడింది. కాంగ్రెసు నాయకత్వం అవలంబించే పాలసీ నేడు కాంగ్రెసును విచ్ఛిన్నం చేసేదిగా వుంది. అందుచేతనే భవిష్యత్తులో దేశభక్తులందరూ మా పాలసీని అంగీకరించు తారనే విశ్వాసం మాకుంది. నాయకత్వం ఒక కమ్యూనిష్టును బయటకు వెళ్ళ గొడితే కాంగ్రెసులోపలనే మరల అట్టివారు నలుగురు బయలుదేరుతారు. దేశభక్తు లకు నేడు మరొక మార్గమేమీ లేదు. భారత ప్రజా ఐక్యత, దేశరక్షణను మించి నేడు స్వాతంత్ర్య సంపాదనకు మరొక మార్గమేమీలేదు. దేశభక్తులందరూ నేడు యావత్ ప్రజల ఐక్యతకొరకు పాటుపడితీరాలి. ప్రతి భారతీయుడి హృదయంలోనూ ప్రజ్వరిల్లుతున్న మాతృదేశభక్తి పునాదిపైనే మనం జాతీయైక్యతను నిర్మించాలి.

జంగ్‌కైషేక్ జపాన్ దండయాత్రను ఎదిరించడానికి జాతీయైక్యత కావాలన్న చైనా కమ్యూనిష్టులపైన పెద్ద దండయాత్ర చేశాడు. అపుడు చైనా కమ్యూనిష్టులు కయ్యానికి కాలుదువ్వారనీ, దేశద్రోహులనీ నిందించబడ్డారు. కాని తుదకు వారే జయం పొందారు. జాతీయఐక్యతను నిర్మించకలిగారు. నేడు చైనాప్రజలు ఆసియా ఖండ ప్రజలందరిలోను ఉత్సాహాన్ని రేకెత్తిస్తున్నారు. నేడు చైనాకమ్యూనిష్టులు ఉత్తమ దేశభక్తులుగా అందరిచేత పరిగణింపబడుతున్నారు. మా చైనా కామ్రేడ్సు నుండి భారత కమ్యూనిష్టులం గుణపాఠాలను నేర్చుకొన్నాము. మేము నిరంతరం ఎడతెగకుండా కృషిచేసి చైనా దేశభక్తుల అనుభవాలనుండి భారతదేశభక్తులు తమ కర్తవ్యాన్ని నేర్చుకునేటట్లు చేస్తాము. చైనాలో జరిగిన వినాశకరమైన అంతర్యుద్ధం వలన చైనా ప్రజలకు ఎట్టి లాభం కలుగలేదు. అంతా నష్టమే. జపాన్‌దుండగీడు లకు మాత్రం అన్నివిధాలా లాభం కలిగింది.

దేశ రక్షణ కొరకు జాతీయైక్యత,
జాతీయైక్యత ద్వారా భారత స్వాతంత్ర్యం,
ఇవే నేడు మన నినాదాలు,

ఆగష్టు 3 వ తేదీ కయ్యూరు 'డే' జరపండి!

కయ్యూరు మరణ శిక్షలు రద్దుచేయుటకు ఆందోళన చేయాలి!

కయ్యూరు దక్షిణ కనరాజిల్లా, హోస్ దుర్గం తాలూకాలో ఒక గ్రామం. ఈ ప్రాంతంలో ఒక 40 గ్రామాలలోని ప్రజలు మలబార్ దేశీయులు, సాంప్రదాయాలు, ఆర్థిక జీవనం ప్రక్కనే వున్న మలబారు జిల్లాలోలాగే ఉంటాయి. ఐనా యీ ప్రాంతాన్ని మలబారు జిల్లాలో కలుపక దక్షిణ కనరా జిల్లాలో కలిపి ఉంచారు. అందుచే మలబారు రైతులకు కొన్ని సౌకర్యాలు, హక్కులు కల్గించే మలబారు టెనన్సీ చట్టాలు వీరికి వర్తించకపోయింది. మలబారు రైతులకు గల శాశ్వత జిరాయితీ హక్కు, వీరికి లేక పోయింది.

1938 నుండి కమ్యూనిష్టుల నాయకత్వం క్రింద జన్మీలకు (వందల కొలది యెకరాలు గల్గి, కౌలుకు భూముల నిచ్చే జమీందారులు) వ్యతిరేకంగా, ఈప్రాంత రైతులు తమ సంఘాలను ఏర్పరచుకొని జన్మీల బాధలనుండి తప్పించుకుంటూ వచ్చారు. కాని 40 సెప్టెంబరులో ఉత్తర మలబారులో కమ్యూనిష్టులను, రైతు వర్కర్లలను అణచివేయడానికి ప్రభుత్వం తీవ్ర నిర్బంధ చర్యలకు పూనుకొంది. ప్రభుత్వపు ఈ నిర్బంధ చర్యలు హోస్ దుర్గంలోని జన్మీలకు ధైర్యం గల్గించాయి. రైతులను పొలాలనుండి బలవంతంగా తరిమివేయటానికి పూనుకున్నారు. అనేకచోట్ల రైతుల పొలాల నుండి పంటలను కోసుకొని పోడానికి ప్రయత్నించారు. రైతులు తమ సంఘాల నాయకత్వాన ఈ ప్రయత్నాలను సాగనివ్వలేదు.

ఈ రైతు ఉద్యమాన్ని అణచివేయటానికి పోలీసుల సాయంతో జన్మీలు పూనుకున్నారు. పోలీసులు విచ్చలవిడిగా రైతు వర్కర్లను అరెస్టు చేయటం, అరెస్టు చేసిన పిమ్మట లాటీలతో చితుక గొట్టటం ఆరంభించారు. కయ్యూరు రైతు ఉద్యమానికి బలిష్ట కేంద్రం. పోలీసుల ఈ అక్రమ చర్యలను రైతులు సహించజాలకపోయారు. పగ సాధించాలనే రోషం యెక్కువయింది. రైతు వర్కర్లను పోలీసులు హింసించటాన్ని ఖండిస్తూ 1941 మార్చి 31 వ తేదీని ఒక ఊరేగింపు జరిపారు. ఆ ఊరేగింపు జరుపుతున్నపుడు ఒక పోలీసు యెదురయ్యాడు. కోపోద్రేకంతో వున్న రైతులు అతనిని తరుమసాగారు. అతడు పారిపోయి ఒక నదిలో దూకాడని, రైతులు రువ్విన రాళ్ళ దెబ్బలకు చనిపోయాడనీ, పోలీసుల సాక్ష్యం.

పోలీసులకు చక్కని అవకాశం దొరికింది. ఈ ఘటనను సాకుగా తీసుకొని ఆ గ్రామాలలోని రైతులను భయభీతులు గావించటానికి అనేక దురంతాలు గావించారు. ఆ 40 గ్రామాలలోని రైతు వర్కరుల నందరిని ఏరి ఏరి ఒక 60 మందిపై కేసు పెట్టారు. జిల్లా జడ్జి 4 గురికి మరణ శిక్ష, 18 మందికి 2 సంవత్సరాలకు మించిన శిక్షలను విధించాడు. హైకోర్టు యీ నెల 24 వ తేదీ దానిని ఖాయ పరచింది. మరణశిక్ష పొందిన కామ్రేడ్స్ అప్పు వగైరా నల్గురు కమ్యూనిష్టులు రైతు వుద్యమాన్ని అణచివేయడానికి జన్మీలతో కలసి [మిగతా 7 వ పేజీలో]

అంతిమ ఘడియ

రచన: బోరిస్ గార్బటావ్ ★ అనువాదం: "గిరీశం"

కామ్రేడ్! ఇప్పుడే ఆజ్ఞచదివి వినిపించారు. తెల్లవారితే యుద్ధానికి పోతాం. ఏడుగంటల్లో తెల్లవారుతుంది.

నిశీధం. ఆకాశంలో దూరంగా మిణుకు మిణుకు మంటున్నాయి నక్షత్రాలు. నిశ్శబ్దం. మారణ యంత్రాల భీకర ధ్వని చల్లారింది. నా ప్రక్క సైనికుడు నిద్రలో పడ్డాడు. ఏమూల యెక్కడో మాట్లాడు తున్నాడు....

మరచిపోలేని వింతగొల్పే నిశ్శబ్దసమయాలున్నాయి!

ఏదో ఒకప్పుడు నేనీరాత్రిని - 1941 అక్టోబరు 30 వ తేదీ నడిరాత్రిని - స్ఫురణకు తెచ్చుకుంటా. డాణా మైదానంపై వాలుతూన్న చంద్రబింబాన్ని, చలిబాధిస్తోందా అన్నట్లు వణుకుతూన్న నక్షత్రాలనూ జ్ఞప్తికితెచ్చుకుంటా. నిద్రలో నా సోదర సైనికుడెలా సొమ్మసిలి దొర్లుతున్నాడో స్ఫురణకువస్తుంది. కొండ గుట్టలమీదా, కందకాలవద్దా నిశ్శబ్దం. తుపాను చల్లారినట్టుంది. పోరాటానికి పూర్వంవుండే ప్రశాంతం. నా తడిసిన ఓవరు కోటు ముందు భాగంతో ఫ్లాష్‌లైట్‌కప్పి నీకీ వుత్తరంవ్రాస్తూ, ఆలోచిస్తూ ట్రెంచిలో పండుకున్నా..... లక్షల కొద్దీ నా సహచరులు —. ఉత్తర సముద్రం నుండి నల్ల సముద్రంవరకూ — నాలాగే సూర్యోదయం — పోరాటం ఎదురుచూస్తూ చావుబ్రతుకుల చింతనతో చెమ్మనేలపై పరున్నారు.

కామ్రేడ్! ఎక్కువకాలం బ్రతకాలని ప్రతివాడికీ వుంటుంది. నాకూ బ్రతకాలనీ, ఈ గాలి పీల్చాలనీ, నడిచే ఓపికుండాలనీ. నెత్తిమీది నిర్మలాకాశం చూస్తుండాలనీ కోరికుంది. ఏదో బ్రతుకు బ్రదుకుదామని మాత్రంలేదు. ఊపిరి నిలబెట్టుకోవటంమాత్రమే నాయీప్సితం గాదు.

గతరాత్రి శత్రుపక్షంనుండి పోరాడివచ్చాడొకవ్యక్తి. మా ట్రెంచిలోకి ఫాసిస్టులనుండి తప్పించుకొచ్చాడు. మొద్దుబారిన మోకాళ్ళతోనూ, రక్తసిక్తమైన హస్తాల్తోనూ పోరాడి వచ్చాడు: మావాడే గాబట్టి మమ్మందర్నీ చూచి ఆవురుమన్నాడు. షేక్‌హ్యాండ్లిస్తున్నాడు. ప్రతివాణ్ణీ కౌగలించుకోవాలనివుంది. ముఖం కందింది. పెదవులు తత్తరపడుతున్నాయి. రొట్టి, వెన్నా, పుగాకూయిచ్చాం. మనసు కుదుటబడ్డది. ఇక జర్మన్ల జబర్దస్తీలూ, దోపిళ్ళూ, నరహత్యలూ, మానభంగాలూ గూర్చి చెప్పాడు.

వింటూంటే రక్తంవుడికిపోతుంది, హృదయం కంపిస్తుంది.

నేనతని వీపు చూడ్డం జరిగింది. మరోవైపు చూడలేకపోయాను. అతని వీపే నా దృష్టి నాకర్షించింది. చెప్పేమాటలకన్నా అదే మరింత కలవరపెట్టింది. అతను ఫాసిస్టుల పాలనలోపడి నెలాపదిహేను రోజులయింది. అయినా వెన్నెముక విరిగినట్టు అతని వీపు విల్లంబులావంగింది. నాజీ దెబ్బలభయంతో నెలాపదిహేను రోజుల్నుండీ వణుకుతూ వెన్నొంచి తిప్పుతూ తిరిగినట్లుంది. సంకల్ప భగ్నం జరిగినవాని వీపు, బానిసమూపు. "నిటారుగా నిలబడు కామ్రేడ్! రొమ్ముసరిచి నిలువు. నీవు నీవాళ్ళతోనేవున్నావు," అని అరిచాడొకడు. నాజీలు నాకొరకేం దాచివుంచారో స్పష్టంగాచూచా: "వెన్నువిరిగిన జీవితం. లోకువ బ్రతుకు."

కామ్రేడ్! సూర్యోదయానికింకా 5 గంటలుంది. ఐదుగంటల్లో యుద్ధానికిపోతాం. నా ముందున్న యీ బూడిదరంగు రాతిగుట్టకోసం గాదు, నేను ఫ్యాసిస్టులతోపోరేది, అంతకన్నా ఉన్నతాశయానికే యీ పోరాటం. నా విధికధిపతియెవరో తేల్చుకోవాలని: హిట్లరా? నేనా?

ఇప్పటివరకూ నీవూ—నేనూ, మన మందరమూ ఎవరికివారే తమతమ లక్ష్యాలకు నిర్ణయకర్తలం. ఎవరిష్టంవచ్చిన పని వాళ్ళం తీసుకున్నాం. నచ్చిన వృత్తి నవలంబించాం. ప్రేమించిన స్త్రీని పెండ్లిచేసుకున్నాం. స్వతంత్రదేశంలో స్వేచ్ఛా జీవులం. భవిష్యత్ కెదురుచూచాం గంపంతాశతో. దేశం మనమాతృదేశం, యింటింటికీ కామ్రేడ్సున్నారు. ప్రతి వృత్తీ గౌరవనీయం. శ్రమ శౌర్యవంతం, స్తవనీయంగా ఎంచుకున్నాం, ఉత్పత్తిచేసిన ప్రతి అదనపు టన్ను బొగ్గూ పరువు ప్రతిష్ఠలతో ప్రజాశ్రమను బహూకరించిందని నీవెరిగిందే. పండిన ప్రతి పుట్టెడు గోధుమలూ నీ సంపదనూ, నీ కుటుంబ సంపదనూ వృద్ధి చేసిన సంగతీ నీకు తెలుసు.

అప్పుడు ఫ్యాసిస్టొస్తాడు. నీపై పెత్తనం చెలాయిస్తాడు. ఉన్నదాన్ని పూడ్చిపెడతాడు. వచ్చేదాన్ని వాళ్ళేవేసుకుంటాడు. నీ జీవితాన్నీ, నీ యింటినీ, కుటుంబాన్ని తన ఆజ్ఞకు జోహుకుమంటాడు. యిల్లూవాకిలీ ఖాళీచేయమంటాడు. వానావరద అనే సంశయంలేకుండా వెన్ను విరగ్గొట్టి గూనితో గెంటుతాడు. ఔను! నిన్ను బ్రతకనిస్తాడు, ఆతనికి బరువులు మోసే జంతువులు కావాలి. నిన్నూ ఒక బానిసను - వెన్నువిరిగిన బానిసను - చేస్తాడు. గాడిద బరువులు మోయిస్తాడు. పుట్టెడు గోధుమలు పండిస్తావు. పండిన పంట నీకుకాకుండా చేస్తాడు. నీకు మిగిలేది మందేఆకలి. టన్ను బొగ్గుతీస్తావు. నిన్నుతన్ని లాక్కుంటాడు. పైగా "రష్యాపందీ. పని బాగుండలేదం"టాడు. నిన్నొక తుచ్ఛజంతువుగా చూస్తాడు. నీమాతృభాష, నీ పూర్వులభాష, నీవెన్నో ఆశలు పెట్టుకున్న భాష, నీవు ప్రేమించిన వ్యక్తికి నీప్రేమ తెలియజేసిన భాష నీవు మరిచేట్టు చేస్తాడు. అతని భాష మాట్లాడమని నీపై సవాళ్ళు చేస్తాడు. నీవు అన్యభాషతో అవస్థపడుతూంటే అపహాస్యం చేస్తాడు. నీ ఆశయాలన్నీ అణగద్రొక్కుతాడు. నీ నమ్మికపై ఉమ్మివేస్తాడు, మీవాడు పెరిగిపెద్దై విద్యాధిక యోగ్యత సంపాదిస్తాడని నీవాశించావు. కాని రష్యా శాస్త్రవేత్తలు ఫ్యాసిస్టుల కుపయోగించరు. వాళ్ళ శాస్త్రజ్ఞుల్నే కాన్సెన్‌ట్రేషన్ క్యాంపుల్లోనెట్టారు. వారికి కావలసింది బుద్ధిమాంద్యంగల పశుతుల్యులు. బాల్యం, యౌవ్వనం, భవిష్యత్తూ అంతా కోల్పోయి ఫాసిస్టు పిశాచం వాతబడతాడు మీవాడు.

మీరు మీకూతుర్ని కనిపెంచారు ప్రేమతో. "మారింకా" చిన్ని శ్వేతగృహానికి నీవూ, నీభార్యా ఎన్నిసార్లుపోయి ఆమె సుఖానికి సంతోషించారు. పరిశుభ్రంగల పవిత్ర రష్యా యువతులు ఫ్యాసిస్టులకెందుకు? నీకానందం కల్గించే నీ అందమైన బిడ్డ "మారింకా"ను సైనికుల సరదాకు వ్యభిచార గృహాల్లోకి పంపి పడుపువృత్తికి బలిస్తారు.

నీ భార్యను - నీ ఒక్సానాను — చూచి నీవు గర్విస్తావు. ఆమంటే గ్రామంలో అందరికీ చాలాయిష్టం. మేమందరం నిన్ను చూచి అసూయ పడతాంగూడా. కాని బానిసత్వంలో స్త్రీలకవకాశాలుండవు. అసహజంగా యౌవ్వనం తీరకముందే వృద్ధాప్యంవస్తుంది. కొద్ది కాలానికే ముదుసలి ఔతుంది. వంగిన నడుంతో, వాడిలిన చర్మంతో........

నీవు నీ తలిదండ్రుల గౌరవిస్తావు. వాళ్ళు నిన్ను కనిపెంచారుకదూ? సుఖంగా, ప్రశాంతంగా, గౌరవంగా ముసలితనం గడపటానికి వారికేర్పాట్లుచేయటంలో మనదేశం నీకెంతో తోడ్పడ్డది. కాని ఫాసిస్టులకు వృద్ధ రష్యా పౌరులతో పనిలేదు; వాళ్ళు పనిచేయలేరు. కాబట్టి పస్తుండాలి. నీవు పండించిన పంటలోనైనా వారికేమీ యివ్వటానికి ఆధికారం నీకు లేదు. ఫ్యాసిస్టులివ్వరు.

ఇదంతా నీవు భరించగలిగితే భరించి ఉండవచ్చు. చావుతప్పించుకు బ్రతకొచ్చు. మొద్దుబారిన మనస్సుతో బుద్ధి కుదుర్చుకొని ఆనందంలేని అంధజీవితం గడపొచ్చు.

నేనా నీచజీవితాన్ని కాలదన్నుతా, అలాంటి గ్రుడ్డిబ్రతుకు నామనసొప్పదు. ఆ తుచ్ఛ జీవితంకంటే చావుమేలు. బానిస బ్రతుక్కంటే వీరమరణం మంచిది. కామ్రేడ్! మూడు గంటలలో సూర్యోదయం. నా భవిష్యతు నాచేతులలోనేవుంది, నా బెయొనెట్ వాడిమొన వైపుంది. నాభవిష్యత్తూ, నాకుటుంబ భవిష్యత్తూ, నా దేశ భవిష్యత్తూ. ప్రజల భవిష్యత్తూ అంతా ....

కామ్రేడ్! నేడే మూడవదళంలోని "ఆంటణ్ ఛువిరిణ్"ను కాల్చివేశాం. రెజిమెంటుచదరంగా తీర్చి నిలబడుంది. ఆకాశం అదిరింది. పండుకులు రెపరెపలాడుతూ బురదలో రాల్తున్నాయి మన సైన్యం నిశ్శబ్దంగావుంది. చడీచప్పుడు లేదు.

పాపం! పిరికిపంద! విద్రోహి! పటాలం విడిచి పారిపోయిన దేశద్రోహి - ఆంటణ్ ఛువిరిణ్ - మాముందు చేతులు వెనక్కుపెట్టుకు నిలబడ్డాడు. మావేపు చూట్టానికిమనసొప్పదు మాతృద్రోహికి. ప్రక్కచూపులు చూస్తున్నాడు. మిత్రులమ మమ్మ చూట్టానికి మనస్కరించలా. గుండెజారిపోయింది. అతనే మాకు ద్రోహంచేశాడుగా పాపం!

ఫ్యాసిస్టులు గెలుపొందాలనా అతనికోరిక? బహుశాకాదు. ప్రతి యితర రష్యన్‌వలెనే అతనికి వారు గెలవటం యిష్టంలేదు. ఐతే అతనిని తుక్కబుద్ధీ, కుందేలుగుండే, వాడూ చావు బ్రతుకులగూర్చీ, భవిష్యత్తునుగూర్చీ ఆలోచించేవుంటాడు." నాబొందే నాభవిష్యతు" అనుకున్నాడని నిశ్చయంగా చెప్పొచ్చు. బ్రతికుంటే బలుసాకైనా తినొచ్చని అతని ఆశ. తాను సూక్ష్మబుద్ధితోనూ, వివేకంతోనూ ఆలోచించుకున్నట్లే ఎంచాడు. "మనవాళ్ళు గెలిస్తే మంచిదే. నా బొందిలో ప్రాణంవున్నట్లే. ఫ్యాసిస్టులుగెలిస్తే - బానిసనౌతా. ఐనా యీ బొందికేమీ భిన్నంవుండదుగా." (మానవ జాతికి తప్పబుట్టితేగాని యీ ఆలోచన కలగ్గూడదు.)

కాలం వెళ్ళబుచ్చటానికి యుద్ధంనుండి పారిపోదలచాడు. పాపం! యుద్ధంనుండి దాక్కోవటమంటే వీడెబ్బ తరమనుకున్నాడు గాబోలు! తనకొరకు తన కామ్రేడ్సు చావాలని అతనివాంఛ. తానుమాత్రం కాళ్ళు ముడుచుక్కూర్చోవాలనే భ్రమ. ఆంటణ్ ఛువిరిణ్! వెర్రిభ్రమలోపడ్డావు.

నీవు పైదొలగితే నీకొరకు పోరాడేవారెవరూలేరు. ఇక్కడ ప్రతివాడూ తనకొరకూ, తన దేశము కొరకూ పోరాడుతున్నాడు, తన కుటుంబంకొరకూ, తన దేశంకొరకూ, తన భవిష్యతుకొరకూ, తనదేశ భవిష్యతు కొరకూ మమ్ముల విడదీయటం నీశక్యంకాదు. వింటున్నావా? మా మాతృభూమినుండి మమ్ము వేరుచేయలేవు. మా రక్తం, మా హృదయాలూ, శరీరాలూ సర్వస్వం అందుకర్పిస్తాం. దేశ భవిష్యత్తే మా భవిష్యత్తు. దేశ విధ్వంసం మా విధ్వంసం. దేశ విజయమే మావిజయం.

మేము జయించినప్పుడు ప్రతివాణ్ణీ "విజయసాధనకు నీవేం త్యాగంచేశావ్" అని ప్రశ్నిస్తాం. మేమేమీ మరిచిపోం, ఎవరినీ క్షమించం. అదుగో అక్కడ సిగ్గుతో పడుకున్నాడు దుష్టుడు ఆంటణ్, దేశద్రోహి, ఆత్మ దేశాన్ని ఆపదలో ఆదరించని అపరాధి. కుక్కబ్రతుకుకోసం శరీరాన్ని కాపాడుకోదలచాడు. కుక్కచావే చచ్చాడు.

మేంమాత్రం దృఢసంకల్పంతో సాగిపోతాం చీకూచింతా లేకుండా సాగిపోతాం. ఉదయానే యుద్ధరంగాని కురుకుతాం. బెయొనెట్‌యుద్ధం, ప్రాణాలలెక్కింపక పోరాడతాం. చస్తేచావన్నీ. ఐనా దేశగౌరవానికి కళంకం కల్గించామనిగాని మాతృభూమికన్నా మా ప్రాణాల్నే ప్రేమించామనిగాని మావైపు వ్రేలెత్తి చూపలేరు.

కామ్రేడ్స్! ఇకరెండు గంటలలో తెల్లవారుతుంది. (మిగతా 8 వ పేజీలో)

ప్రబోధము

(మార్చింగ్ సాంగ్)

['జగమునందు కలదెనాడు జన్మభూమివంటిదీ' అనుమాదిరి.]

1. ముందునడూ, వేగనడూ, మృత్యుభీతి వదలవోయి
   క్రూర ఫాసిష్టుమూక వురికివచ్చుచున్నదోయి॥
2. బానిసత్వమునకు బుర్రవొగ్గి తృప్తిపడుదువా
   అంతన్న కంఠమిచ్చి చచ్చిపోవుటుత్తమం॥
3. మనదు మేని యెముకలన్ని పేర్చి యుద్దుగొట్టుదాం
   ప్రాణమిచ్చి ఫాసిజాన్ని మంటగలపి తీరుదాం॥
4. ఒక్కటై పదండి దుఃఖ వేదనల భరించుదాం
   చావుకైన బాధకైన పదుగురున్న భయమెదోయి॥
5. ముందుసాగు కలసినడు దమందరిదీ యుద్ధమోయి
   విజయ నాదములతో వేగ స్వేచ్ఛకొరకు సాగవోయి॥

— కామ్రేడ్ మహీధర రామమోహన్,

వర్కింగ్ కమిటీకి బహిరంగ లేఖ

(1 వ పేజీ తరువాయి)

మీ "పోరాటం"

బ్రిటన్, అమెరికా, చైనా, యితర స్వాతంత్ర్యప్రియ రాజ్యాల ప్రజలు బ్రిటిషు ప్రభుత్వానికి తెలివి వచ్చేటట్లు చెయ్యజాలకపోతే, సాంప్రదాయమైన పోరాటం ప్రారంభించడానికి మీరు ప్లాను వేస్తున్నారు. అలాంటి "పోరాటం" యీ రోజున నిరంకుశాధికారుల్ని నాశనం చెయ్యకపోవడమే గాకుండా, బలపర్చుతుంది. ఫాసిస్టు దుండగీంద్రతో భారత ప్రజలు పోరుసల్పడానికి బ్రిటిషు పరిపాలకవర్గం ఆటంకాలు కలుగజేస్తుందనీ, అందుకు కారణం అలా పోరుసల్పితే భారతదేశ స్వాతంత్ర్యానికే, తమ అధికార పతనానికే దారితీస్తుందనీ, మీకు తెలుసు. క్రిప్సు రాయబారాల అనుభవం ద్వారా యీ విషయంమీరు తెలుసుకున్నారు. మీలోకొందరు బహిరంగంగా తెలియజేశారు.

అట్టి పరిస్థితులలో మీరు మీ "పోరాటా"న్ని ప్రారంభించడంవల్ల సామ్రాజ్య వాదుల్ని, నిరంకుశ వర్గాన్నీ, బలపరుస్తున్నా రన్న విషయం స్పష్టం అవుతోందిగదా। పోరాటాన్ని మీరు ప్రారంభిస్తే, అప్పుడు యేమి జరుగుతుందో చూదాం.

నిశ్శబ్దంగా మిమ్మల్ని, యింకా చురుకుగా పనిచేసే వేలకొలది కాంగ్రెసువాదుల్ని, వారు జైళ్ళలో నిర్బంధిస్తారు. ఫాసిస్టు దండయాత్రినుంచి భారత భూమిని రక్షించడానికి శక్తిగలిగి యుండటం దురదృష్టమైన తమ కర్తవ్యము అంటూ లోకం అంతటా డబ్బావాయించుకుంటారు. మీరు, యింకా ఇతరదేశభక్తులు, ప్రజలమధ్య ఉండి. ప్రజలను నడిపించవలసిన సమయంలో మిమ్మల్ని సామ్రాజ్యవాదులు ప్రజలనుంచి దూరంచేసి వేయతల్లుతారు. మనప్రజల్ని జాతీయ ప్రతి ఘటనకు సన్నాహపరచి సంఘటత మొనర్చడం నేడు మీ యొక్క చారిత్రాత్మకమైన బాధ్యత. ప్రజల్ని నాయకులు లేకుండాచేసి, పిచ్చియెత్తిన నిరంకుశ పరిపాలకుల చేతుల్లో విడువడం న్యాయముకాదు. మనదేశంయొక్క రక్షణను మీరు జీతం రాళ్ళకు పనిచేసే సైనికులకు, విదేశీయ ప్రభుత్వానికి. వదలిపెట్టడం జరుగుతుంది. అట్టి పరిస్థితులలో మన గతి యేమవుతుందో మీరు ఊహింపజాలరా? మలయా ప్రజల గతి, బర్మా ప్రజలగతి, ఏమయిందో మరచిపోయారా? ఈ ఘటనలన్నీ, చూస్తూ మీరు కంపించి పోవడంలేదా? కాంగ్రెసు - ముస్లింలీగు ఐక్యతను సాధించే బాధ్యతనుఇప్పుడైనా మీరు వహించవద్దా?

జపాను ఫాసిస్టులకు సహాయకారి

స్వాతంత్ర్య ప్రియులైన రాజ్యాల యెదుట భారత జాతీయోద్యమాన్ని 'పంచమాంగదళం' అని సామ్రాజ్యవాదులు దుమ్మెత్తి పోస్తారు. ఫాసిజాన్ని ఎంత తీవ్రంగా ఖండించి నప్పటికీ మిత్రరాజ్యలవైపు మనకుగల స్నేహభావాన్ని ఎంత ఎక్కువగా ప్రకటించి నప్పటికీ; నిరంకుశాధికారుల్ని దేశంనుంచి తరుమ గొట్టాలని మీరు ప్రారంభించబోయే "పోరాటం" జపాను ఫాసిస్టుల్ని దేశంలోకి రానివ్వడంలో సహాయ పడక మానదు. ఈ యదార్థాన్ని ఎవ్వరూ మరుగు పరచజాలరు. మీ మనస్సులలో మాత్రం మీరు జపాను ఫాసిస్టులు వస్తే పోరాడటానికే సంకల్పించుకున్నారు. కనుక యిప్పుడే దేశంనుంచి బ్రిటిషు నిరంకుశుల్ని పారద్రోలా లంటున్నారు. ప్రపంచ ప్రజలను లోకియో, బెర్లిన్, రేడియోల వద్ద కూర్చొని మన పోరాటం ఎంత చక్కగా ఫాసిస్టులకు ఉపకరిస్తూందో వినమంటూ సామ్రాజ్యవాదులు హెచ్చరిస్తారు. మన జాతీయ వాంఛ సిద్ధించడానికి మిత్రరాజ్యాలు కలుగ జేసుకొనేటట్లు చేయడానికి బదులు, మీ "పోరాటం" అందుకు వాయిదాలు వేస్తుందన్నమాట. భారత దేశభక్తు లందరూ నమ్మరానివారని తెలియని ప్రజలు అనుకొంటారు. గందరగోళంలో పడికొట్టు కొంటున్నాం అని మన మిత్రులంటారు. భారత ప్రజాతంత్ర విధానానికి ప్రపంచ ప్రజాతంత్ర శక్తులు యీ విధంగానేనా సహాకారం చేయగలడం, ఊహించుకొంటేనే మన శిరస్సుసిగ్గుచే కృంగి పోతూంది।

కాబట్టి మీరుతలపెట్టే ఉద్యమం వల్ల మనం విదేశీ నిరంకుశాధి కారుల్ని నిజంగా దెబ్బతీయడం లేదనీ, మన శ్రేయస్సుకే దెబ్బతీసుకొంటున్నాం అనీ, మీరు చూడవలసినదిగా ప్రార్థిస్తున్నాం.

స్వాతంత్ర్యానికి పోరాటం అవసరం

భారత దేశ స్వాతంత్ర్యము కొరకు పోరాడ వలసియుంది. మనమే పోరాడవలసి యుంది. ఇంతేకాదు. ఈ పోరాటంఎంతో విశాలమైనట్టి యుద్ధరంగంలో ప్రపంచ ప్రజలందరితోను కలిసి. పోరాడ వలసి యుంది. మనమే పోరాడవలసి యుంది. పాత యజమానులు మనల్ని బానిసత్వం లోనే ముంచుతున్నారు. కొత్తయజమానులు. ఎన్నోరెట్లు క్రూరయజమానులు, మన మీదికి దుముకు తున్నారు. మనపైగల బ్రిటిషు సామ్రాజ్యాధికారం అవసాన దశలో వుంది. నేడు మనల నెదుర్కొంటూన్న సమస్య యేమంటే. మనపైనున్న బ్రిషు సామ్రాజ్యాధికారన్ని "నాశనం" చేసి, అనగా దాని స్థానే జపాను ఫాసిజాన్ని స్థాపించు కోవడమా, లేదా సకాలంలో మనమే మన దేశాన్ని యీ నిరంకుశాధికారుల చేతుల్లో నుండిరక్షించుకొని జాతీయప్రభుత్వాన్ని సంపాదించు కొని, జయ ప్రదంగా శత్రువును ఎదుర్కొంటూ మనజాతీయ స్వాతంత్ర్యము వైపు సాగిపోవడమా? మన జాతీయ సాంప్రదాయ మంతటిలోనూ ప్రధాన స్థానం అలంకరిస్తున్నది ఏమంటే జాతీయైక్యత. మన జాతీయ జీవనమే నేడు ప్రమాదస్థితిలో ఉన్నప్పుడు జాతీయైక్యతపైననే మనం ఆధారపడదాం. దానిని మనం సాధించుదాం. నేటిమన బానిసస్థితిలో మన జాతీయైక్యతలోనే మన బలం అంతా వుంది. అదేనేడు మన కత్తి; అదే మన డాలు. మీరు దేశాన్నంతటినీ నడిపేమార్గదర్శకులు మన ప్రజలకు ముప్పు, మన దేశానికంతటికీ ఫేసిజం క్రింద సర్వనాశనం జరిగే తప్పునడకను మీరునడిపించడానికి వీలులేదు. జాతీయ ప్రభుత్వాన్ని సాధించే టందుకు జాతీయైక్యత అవసరం కాబట్టి మీరే ముందంజ వేసి దానికై కృషి చేయవలసి యుంటుంది. మనపై యిప్పుడున్న బ్రిటిషు అధికారం నాశనం చేసి ఫేసిస్టు దురాక్రమణ దారులతో జయ ప్రదంగా పోరు సల్పడానికి యిదే చక్కని మార్గం.

సామ్రాజ్యవాద నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జాతీయ ప్రభుత్వం, దాన్ని సాధించడానికి జాతీయ యైక్యత కావాలి.

ఫాసిస్టు దురాక్రమణదారులకు వ్యతిరేకంగా జాతీయ ప్రతిఘటన, అందుకై జాతీయైక్యత

ఇదే భారత ప్రజల నిజమైన జాతీయ పోరాట మార్గం. గాంధీజీ ప్రారంభించబోతునట్టీ, మీరంతా ఆమోదించినట్టీ, "పోరాటం" ఒక విధానంతోకూడిన పోరాటంకాదు. అదొకజూదం. అది స్వాతంత్ర్యము కొరకు సాగించే పోరాటంకాదు. జైళ్ళకుపోయి తప్పించుకోవడం. అది ప్రజల్ని నడిపించడంకాదు, ప్రజల్ని విడనాడటం. ఆది సామ్రాజ్యవాదనిరంకుశత్వాన్ని నాశనంచెయ్యదు. దానిక్రిందనే మనం ఉండేటట్టుచేసి, తరువాతవచ్చే జపాను ఫాసిస్టుల చేతులలోకి మనన్ని మార్చుతుంది, అట్టి "పోరాటం" మనకు స్వేచ్ఛను యివ్వజాలదు. ఫాసిజాన్ని ప్రసాదిస్తుంది.

ఫాసిస్టు దురాక్రమణదారులు చచ్చేవరకు పోరు సల్పడానికి దేశాన్ని తయారుచేయండి. అది స్వాంతంత్ర్యానికి పోరుసల్పడం. ఎందువల్లనంటే, స్వాతంత్ర్యానికి మార్గం అదొక్కటే.

దేశాన్నంతటినీ ఐక్యపరచడానికి బయల్దేరండి. కాంగ్రెసు-లీగ్ ఐక్యతను సమకూర్చిననాడే జాతీయ ప్రభుత్వంవస్తుంది. అప్పుడే నిరంకుశాధికారులు పోతారు,

సగర్వంగా మీరు నడిపించండి. భక్తితోమేము అనుసరిస్తాం,

స్వేచ్ఛకలిగిన ప్రపంచములో భారతదేశం స్వేచ్ఛతో వికసిస్తుంది.

విప్లవము వర్ధిల్లుగాక!

కామ్రేడ్ సుందరయ్య అరెస్టు

ఆంధ్ర కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యగార్కి జులై 28 వ తేది బెజవాడ గాంధీపార్కులో వివిధ కార్మిక, యువజను సంఘములచే సన్మాన పత్రం ఇవ్వబడెను. కామ్రేడ్ చలసాని వాసుదేవరావు గారు అధ్యక్షత వహించారు. సుందరయ్యగారు ప్రజాయుద్ధపాలసీని వివరించుతూ ఉపన్యసించారు. జపాను దాడిని ఎదిరించుట ద్వారానే భారత స్వాతంత్ర్య స్థాపించబడుతుందని తెలియజేసారు. సభ ముగిసిన వెంటనే స్థానిక పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టరు వచ్చి సుందరయ్య గారిని అరెస్టుచేసి స్టేషనుకు తీసికొని వెల్లారు. సుందరయ్య గారినిపట్టుకుంటే వెయ్యి రూపాయలు బహుమతి యిస్తామని యుద్ధారంభంలో ప్రకటించబడింది. వారు 3 సంవత్సరాలనుంచి రహస్యంగా వుండి పని చేస్తున్నారు. వారిపై వున్న వారంటును రద్దు చేసికొన్నామని ఇండియా ప్రభుత్వం తెలుపుటచే వారు నేటి సభలో ఉపన్యసించారు, స్థానిక పోలీసులు తెలివితక్కువగా వారిని అరెస్టు చేసారు.

ప్రపంచ యుద్ధసమీక్ష

రోస్టోవ్ పతనం

జర్మను సేనలు యీ వారం సోవియటు రంగాన యింకా ముందుకు సాగాయి. స్టాలిన్‌గ్రాడ్ సమీపంలో మలుపు తిరిగి పడమటకు ప్రవహిస్తూ రోస్టోవ్ నగరంకు దక్షిణంగా అజొవ్ సముద్రంలో డాన్ నది పడుతుంది. ఈ దక్షిణ డాన్ ఒడ్డుకు జర్మను సేనలు చేరాయి. రాస్టోవ్-స్టాలిన్ గ్రాడ్‌లకూ మధ్య రెంటికి సరిసమాన దూరంలో వున్న స్మిల్యాంస్కాయా వద్ద డాన్ నదిని దాటి జర్మను సేనలు కొన్ని ఒడ్డున చేరాయి. వానిని నాశనం గావించడానికి సోవియటు సేనలు తీవ్రంగా పోరాడుతున్నాయి. రోస్టోవ్ నగరం శత్రువశమయిందని సోవియటు ప్రకటన తెలియజేస్తుంది. రోస్టోవ్ నగరాన్నుండి గత నవంబరు నెలాఖరున జర్మనులను తరిమినప్పుడు రోస్టోవ్ ప్రజలపై పగ దీర్చుకొంటామని జర్మను సేనా నాయకులు ప్రకటించారు. సోవియటు సేనలు మహా ఆవేశనతో రోస్టోవ్ నగరాన్ని రక్షించడానికి పోరాడారు. కాని మూడు వైపుల నుండి 2000 టాంకులతో కొన్ని వేల విమానాలతో, లక్షలకొలది సైన్యాలతో చుట్టు ముట్టడించినపుడు రోస్టోవ్ శత్రువశంగాక తప్పిందికాదు. కాని రోస్టోవ్ చుట్టు యేర్పరచుకొన్న కందకాలను రక్షిస్తూ, సోవియటు సేనలు చేసిన ప్రతిఘటనను భగ్నం చేయడానికి జర్మను సేనలకు మూడు రోజులకు పైగా పట్టిందని. సోవియటు సేనలకు శత్రువులే ప్రశంసిస్తూ వున్నారు. డాన్ నదీ మలుపు మధ్య నున్న ప్రాంతాన్నంతా తాము వశం చేసుకున్నామని జర్మనులు ప్రకటిస్తున్నారు. ఇదే నిజమయితే డాన్ నదీ తీరమంతా జర్మనుల చేతిలో వుంది. స్టాలిన్ గ్రాడ్‌కు 60 మైళ్ళలో నాజీ సేనలు వచ్చాయన్న మాట.

ఉత్తరాన వారొనొష్ వద్ద సోవియటు సేనలు నాజీలను డాన్ నదికి పడమటవైపుకు నెట్టివేస్తున్నాయి. నాల్గు వంతెనలలో మూడు వంతెనలు ఆక్రమించుకున్నాయి. తామే పడమటి ఒడ్డుకు వెళ్ళి నాల్గవ వంతెన మీదుగా నాజీ సేనలు వెనక్కి తప్పించుకొని పోకుండా జేయటానికి ప్రయత్నిస్తున్నాయి.

సోవియటు ప్రతిసన్నాహాలు

నాజీలు స్మిల్యాంస్కాయా వద్ద డాన్ నదిని దాటడంవల్ల ఉత్తర క్యాకసస్‌పైకి పోవడానికి వీలు కలుగుతుంది. దానిని యెదుర్కొంటూ వున్న సోవియటు సేనలకు వెనుక భాగాన కెర్చ్ ద్వీపకల్పాన నుండి జర్మను సేనలు దాడి చేయవచ్చు. కాకసస్ నూనె గనులకు, స్టాలిన్‌గ్రాడ్‌కు ప్రమాదం హెచ్చింది. ఈ ప్రమాదాన్ని యెదుర్కోడానికి యిక యేమాత్రం వెనక్కి తగ్గడంకన్న నిలుచున్న చోటే యుద్ధంజేస్తూ మరణించడం మెరుగని స్టాలిన్ సైన్యాలకు సందేశం పంపాడు. మాస్కో రేడియో సోవియటు ప్రజలను ప్రబోధిస్తూ ఇలా అంది.

"విజృంభించి మన దేశ అంతర్భాగాలలోకి చొచ్చుకురావడానికి శత్రువు తన సైనిక బల సర్వస్వాన్ని సమీకరించుకొని మరియొక పర్యాయం దాడి చేస్తున్నాడు, శత్రువును, రొమ్ము ఎదురొడ్డి అరికట్టండి. ఈ నదమూడు మాసాలలోను సోవియటు దేశ భక్తులు కని విని యెరుగని అమోఘ వీర కృత్యాలను వేల కొలది సాధించగలిగారు. ఈ దేశ భక్తి మరింత యెక్కువ వగుతూవుంది. దానిని వెల్లడించే పద్ధతి దేశ క్షేమంకోసం పని చేయడమే. ఇది దేశ భక్తు లందరికీ తెలుసు. వారు తమ పనులవల్ల తమ దేశ భక్తిని ఋజువు చేస్తారు. శత్రువు అరికట్టబడి నాశనం చేయబడుతాడు."

టిమోషెంకో సహాయంగా లోబోవ్ నాయకత్వాన కాకసస్‌నుండి, వాల్గా నదీ ప్రాంతాన నుండి సోవియటు రిజర్వు సేనలు డాన్ నదీ తీరానికి వస్తూవున్నాయి. సోవియటు ఈ తిరోగమనాన్ని సోవియటు సేనల నూతన పోరాట పద్ధతులను చూచి జర్మను సేనానులు కంగారు పడుతున్నట్లు ఈ క్రింది బెర్లిను బ్రాడ్‌కాస్టును బట్టి అనుకోవాలి. జర్మను జనరల్ డీట్మెరు ఈ బ్రాడ్ కాస్టులో యీలా అన్నాడు.

"సోవియటు సేనలు గత సంవత్సరం వలే ప్రతి అడుగుకోసం పోరాడుటలేదు. కావాలనే వెనక్కి పోతూ ఉన్నారు. డాన్ నది ఒడ్డున నిలబడి పోరాడాలనే ఉద్దేశంతో యీలా వెన్కి తగ్గుతున్నారు. సోవియటు సేనలు సమయం చూచుకొని, పెద్ద యెత్తున యెదురదాడి ఆరంభించవచ్చు. మనం జాగ్రత్తగా ఉండాలి"

కాకసస్‌కు ప్రమాదం గలిగితే?

కాకసస్‌కు ప్రమాదం హెచ్చేకొద్దీ ప్రపంచ ప్రజలంతా రెండో రంగాన్ని ఆరంభించి సోవియటునుండి జర్మను సేనల ఉద్ధృతాన్ని తగ్గించాలని ఆందోళన తీవ్రంగా చేస్తున్నారు. కాకసస్ జర్మనీ చేతుల్లో పడితే సోవియటు పెట్రోలు గనులలో సగం జర్మను చేతులలోకి పోతాయి. సోవియటుకు యింకా సగం గనులు వాల్గా నది ప్రాంతాలలోని ఊఫాలో ఉన్ననూ కాకసస్ పోవడం తీవ్ర నష్టం కాక తప్పదు, తాము వశపర్చుకున్న నూనె గనులను జర్మనులు కొంతవరకు బాగుచేసుకొని ఉపయోగించుకో గల్గుతారు. అంతేగాక కాకసస్‌లో జర్మనీ సేనలను ఆపుచేయజాలకపోతే ఇరాను ఇరాకులను జర్మనీ చేతిలో పడకుండా ఆపడం అసంభవ మవుతుంది. ఇప్పట వున్న నూనె గనుల పైననే భారత దేశము, మధ్య ప్రాచ్య దేశాలు, ఈజిప్టులలో వున్న మిత్రమండలి సైన్యాలు, నౌకలు ఆధారపడి వున్నాయి. ఇరాను, ఇరాకులు పోవడంతో మిత్రమండలి యుద్ధ నిర్వహణ ఈ రంగాన దాదాపుస్తంభించపోతుంది.

టర్కీ లొంగుతుందా?

అంతేగాక టర్కీ, జర్మనీ వైపు చేరే ప్రమాదం మరింత హెచ్చుతుంది. టర్కీలోని సోవియటు రాయబార కార్యాలయ మందలి యిద్దరి ఉద్యోగులపై వాన్‌పాపెను (జర్మనీ రాయబారి) పై బాంబు వేయడానికి ప్రయత్నించారన్న తప్పుడు కేసులో 20 సంవత్సరాలు కఠిన శిక్ష టర్కీ ప్రభుత్వ కోర్టులు వేశాయి. తరువాత కొన్ని రోజులకు సోవియటు రాయబారీ, ఆకార్యాలయంలోని బిడ్డలు స్త్రీలు, రష్యాకు వెళ్ళిపోయారు. ఈ రెండు ఘటనలు టర్కీ రష్యాకు వ్యతిరేకంగా యుద్ధంలోకి దిగుతుందనుకోడానికి అవకాశమిస్తూ వున్నాయి, ఈజిప్టులో బ్రిటిషు సేనలు వెనక్కి పోతూవున్న రోజులలో పార్లమెంటులో టర్కీపై అది యెట్టి విపరీత ఫలితం కల్గిస్తుందో అన్న భయాన్ని చర్చిల్ ప్రకటించాడు, ఒక వారం రోజులక్రితం లండనులోకి టర్కీషు రాయబారి, బ్రిటను టర్కీకి వ్యతిరేకంగా తొందరపడి యెట్టి చర్య తీసుకోకూడదని అపీలు చేస్తూ ఉపన్యసించాడు. అంటే బ్రిటిషు ప్రభుత్వం టర్కీపై అనుమానం కల్గి, యేదో చర్య తీసుకోడానికి ఆలోచిస్తున్నదన్న మాటేగా!

ఈ జిప్టురంగం

ప్రస్తుతం ఈజిప్టులో నాజీ సైన్యాలను, ఆపి, మన మిత్రమండలి సేనలు తమ స్థానాలను రక్షించుకోడానికి కొన్ని కీలక స్థానాలను గూడ ఆక్రమించుకున్నాయి. కాని మనం గట్టెక్కలేదన్న విషయం మరచిపోగూడదు, ఈజిప్టు ప్రభుత్వ ధోరణికూడ ఆట్టేబాగాలేదు. అసలు నహాస్‌పాషా మంత్రివర్గాన్ని ఈజిప్టు రాజుఫరూక్, అధికారంలోకి తెచ్చింది, ఎప్పుడు? అంతకు పూర్వమున్న బ్రిటిషు అనుకూల మంత్రివర్గం, విషీ ఫ్రెంచి ప్రభుత్వముతో సంబంధం తెగగొట్టు కుందనే కారణంతో తొలిగించిన పిమ్మటే. అక్షరాజ్యాలకు అనుకూలుడైన ఫరూకే, నహస్ పాషాకు అధికారమిచ్చాడంటే నహస్ పాషా మంత్రివర్గంపై కూడ అనుమానం తప్పదు దానికితోడు ఈజిప్టు సేనలుగాని, ఈజిప్టు కార్మికులుగాని, ఈజిప్టులోని మిత్రమండలి పౌరులకు ఏ మాత్రం తోడ్పడకుండా జేస్తున్నాడు నహస్, గతవారం, అక్షరాజ్యాలనుండి ఇకముందు కాందిశీకులను ఎవ్వరినిరానివ్వమనీ, ఇదివరకు వచ్చిన వారినికూడ ప్రత్యేక క్యాంపులో పెట్టుతాననీ నహస్‌పాషా ప్రకటించాడు. ఈచర్యలు ఏవీ మిత్రమండలికి అనుకూలమైనవిగావు.

అటు కాకసస్, ఇటు ఈజిప్టులలో జర్మను ఉద్ధృతాన్ని తగ్గించాలంటే వెంటనే రెండవ రంగాన్ని పశ్చిమ యూరపున ఆరంభించాలి. దీనికోసమే ప్రపంచ ప్రజలందరూ ఆందోళన చేస్తూవున్నారు.

రెండవరగం:

న్యూయార్కు రాష్ట్రంలో 10 లక్షలమంది ట్రేడుయూనియన్ సభ్యుల తరపున ఒక కమిటీరూజువెల్టును సందర్శించింది.

రెండవరంగాన్ని వెంటనే ఆరంభించడం, సంయుక్తదేశాల క్షేమంకోసమేగాక అమెరికా భద్రతకుకూడ అవసరమని వారు తెలియజేశారు. న్యూయార్కు నగరంలో మాడిసన్ పార్కులో 60 వేల మంది ప్రజలు సమావేశమై రెండవరంగాన్ని వెంటనే ప్రారంభించాలంటూ తీర్మానం చేశారు. సెనేటర్ మీడ్ ఇలా ఉపన్యసించాడు. "చలికాలం వచ్చేముందే హిట్లరు గెలువాలి లేదా ఓడిపోకతప్పదు. ఆసియాఖండమందలి అసంఖ్యాక ప్రజలు, ఆక్రమిత యూరప్ ఆఫ్రికాలలోని ప్రజల సహకారం పొందితేనే మనమీ యుద్ధంలో గెలువగలము."

లిట్వినోఫ్, రూజువెల్టునుచూచి రెండవ రంగాన్ని వెంటనే ఆరంభించమని కోరాడు. రష్యన్ ప్రజలు, ఎప్పుడు రెండవరంగాన్ని మిత్రమండలి ఆరంభిస్తుందా అని ఎదురు చూస్తున్నారు.

బ్రిటనులో బొగ్గుగనుల పనివాండ్ర సమావేశమూ, లంకషైరు కార్మికులూ, ఏకగ్రీవముగా ఈ తీర్మానాన్ని చేశారు: "యుద్ధపరిస్థితుల విషమతను గుర్తించి వాగ్దానంచేసిన రెండవ రంగాన్ని వెంటనే ఆరంభించి రష్యన్ ప్రజలకు తోడ్పడాలి." లండన్ నగరంలోని ఆయుధ కర్మాగార కార్మికుల తరపున ఒక రాయబారవర్గం చర్చిలునుచూచి రెండవ రంగాన్ని ఆరంభించమని కోరారు. కామన్సు సభలో అనురిన్ బివాన్ పార్లమెంటు సెలవుల కోసంమూసేముందు ప్రభుత్వ యుద్ధయెత్తులను గూర్చి చర్చించాలంటూ ఇలా అన్నాడు. "పత్రికలూ, దేశమూ, ప్రభుత్వపుమిలటరీ స్ట్రాటజీ విషయమై ఆందోళన పడుతున్నాయి. ప్రతిచోట ప్రదర్శనాలు జరుగుతున్నాయి. కార్మికులు ప్రతిచోటా రెండవరంగాన్ని ఇంకా ఆరంభించలేదని చాలా ఆదుర్దా బడుతున్నారు. అందోళన పడుతున్నారు. అసంతృప్తి ఎక్కువగుతూంది. పత్రికలో రోజూ రెండవరంగాన్ని ప్రారంభించాలని అందోళన సాగుతూ ఉంది." అయినా క్రిప్సు మహాశయుడు ససేమిరా అన్నాడు.

బ్రిటిషు మంత్రివర్గ సభ్యుడైన బెవిన్‌మంత్రి ఒక కార్మిక సమావేశములో ఉపన్యసిస్తూ, "రెండవ రంగాన్ని ఆరంభించాలని అందోళన చేసేవారు. హిట్లరు, గోబిల్సుకు లాభంచేసినవారవుతారేగాని సోవియట్‌కు సాయపడరు. యుద్ధాన్ని గెలువడానికి రెండవరంగాన్ని ఆరంభించాలసిన అవసరములేద"న్నాడు. అమెరికా మంత్రివర్గకార్యదర్శి కార్డల్ హల్ ఉపన్యసిస్తూ "మనం మన తీరాలలో కూర్చునివుంటే యుద్ధాన్ని గెలువలేం. శత్రువుపైదాడి చేయాలి" అన్నాడు. కాని, రెండవ యుద్ధరంగాన్ని గూర్చి ఏమీ చెప్పడు, యుద్ధానంతరం తాము ఏమిచేయాలో అది చెప్పుతాడు. ఆ చెప్పేది గూడ ఎవరికీ ఉత్సాహం కల్గించడంలేదు. ప్రపంచ వర్తకవ్యాపారాలు పెంపొందించడానికి ఆటంకాల నన్నిటినీతొలిగించాలంటాడు. ఇది పారిశ్రామికంగా బలిష్టమయిన అమెరికా వ్యాపారం ప్రపంచమంతా వ్యాపించడానికి తోడ్పడుతూంది తప్ప మరేమీ కాదు.

ఈ లోపల జపాను, జర్మనీకి కావలసిన ముడిసరకులను ముఖ్యంగా రబ్బరును నావలపై పంపి, తనకు కావలసిన యంత్ర పరికరాలను జర్మనీనుండి తెప్పించుకుంటూవుంది. అక్షరాజ్యాలు పరస్పరసహాకారం చేసుకొంటూ తమ బలాన్ని పెంపొందించు కుంటున్నాయి. దక్షిణ అమెరికా, దక్షిణాఫ్రికాలనుచుట్టి, జపాను నావలు జర్మనీకి వెళ్ళుతున్నాయి. జపానువారు ఆస్ట్రేలియా ఉత్తర తీరానికి రక్షణ స్థానమయిన న్యూగినియాలోని మోర్సబీరేవుకు సమీపంలోని బూనా అనే రేవునుగూడ ఆక్రమించుకున్నారు.

బర్మాలో జపాను పాలన

బర్మాలో జపాను తన అధికారాన్ని బలపర్చుకొంటూ వుంది. బర్మా ప్రజలను తన లాభాలకోసం పీడిస్తూవుంది. అక్యాబ్ పరిసర గ్రామాలనుండి యీ మధ్యనే అమెరికాకు వెళ్ళిన డబ్ల్యు. యస్. మందే న్యూయార్కు టైమ్సు పత్రికలో యీలా వ్రాశాడు. "బర్మా దేశస్థులు నేడు తిండికి లేక కరువుకు గురి అవుతున్నారు. ఇది వరకు బర్మానుండి 4 కోట్ల బస్తాల ధాన్యం ఒక్క విదేశాలకే ఎగుమతి చేసేవారు. ప్రతి గ్రామంనుండి బర్మా కార్మికులు హార్బరులలోను, రోడ్లమీద పని చేయాలని, పన్ను కట్టవలసినవారంతా ఈ పనిని చేస్తేనేగాని పన్ను కట్టినట్లు పరిగణిస్తామని, జపానువారు ఆర్డరు చేశారు. జపానువారు తమ కరెంసీ నోట్లతో బర్మా గ్రామాలను నింపారు. ఇదివరకు ఉపయోగించే కరెంసీ నోట్లు చెల్లామణి కావడంలేదు, ఎక్కడనో దాచుకోవలసి వచ్చింది, జపాను సైనికులు చుట్టుప్రక్కల గ్రామాలలోకి వెళ్ళి బియ్యం, తదితర ఆహార పదార్థాలను లాగుకుంటూ వున్నారు. వర్తకులు, (మిగతా 6 వ పేజీలో)

మన రాజకీయాలు

గత 23 వ తేదీన ఇండియా ప్రభుత్వం భారత కమ్యూనిస్టు పార్టీపై నిషేధాన్ని తొలగించింది. యుద్ధాన్ని ప్రజా యుద్ధముగా పరిగణించి, భారతప్రజలు తమ ప్రయోజనాల నిమిత్తమే స్వాతంత్ర్యం కోరే తదితర సంయుక్త దేశాల ప్రజలతో కలసి జయించాలంటున్నారనీ, అవకాశమిస్తే కమ్యూనిస్టులు ప్రజలకు యుద్ధ స్వభావాన్ని నచ్చచెప్పి, దేశ రక్షణకు, శత్రు ప్రతిఘటనకు ప్రజలను ఆర్గనైజు చేయడానికి సిద్ధంగా వున్నారనీ నిషేధాన్ని రద్దు చేస్తున్న ప్రభుత్వ ప్రకటనలో వుంది.

కమ్యూనిస్టుపార్టీపై నిషేధం తొలగింది

భారత కమ్యూనిష్టు పార్టీ 1934 జులై 23 తేదీన ఇండియా ప్రభుత్వంచే నిషేధించబడింది. 1942 జులై 23 వ తేదీన నిషేధం రద్దు అయింది. అనగా సరిగా గత 8 సంవత్సరాలుగా ప్రభుత్వ నిర్బంధ విధానాన్ని యెదుర్కొంటూ కమ్యూనిష్టుపార్టీ పనిచేయగల్గింది ఈ కాలంలో భారత దేశమంతటా సంఘటితమైన పార్టీగా బలపడింది. ప్రపంచ యుద్ధారంభమైనప్పటి నుండీ తీవ్రమైన చర్యలను గైకొని వందలకొలది సభ్యులను యెట్టి విచారణ లేకుండా జైళ్ళలో పెట్టినా, అనేకమంది పట్టుకుంటే బహుమతు లిస్తామనీ ప్రభుత్వం ప్రకటించినా మనపార్టీ భారత ప్రజల సహాయంతో సంఘటిత పార్టీగా పనిచేయ గలిగింది. ప్రజాశక్తియే పునాదిగా గల్గిన కమ్యూనిష్టు పార్టీ ప్రజలకు దూర మవనంతకాలం ఎట్టి ప్రభుత్వం నిరంకుశత్వానైనా యెదుర్కొని ప్రజా సేవ చేయగల దని రుజువు చేయబడింది.

ప్రభుత్వ ప్రకటన వెలువడటంతోనే వివిధ పత్రికలు, వ్యక్తులు వింత వింత వ్యాఖ్యానాలు గావించసాగారు. చాలమంది పౌరస్వత్వ హక్కులను యిచ్చినందుకు సమ్మతితెలిపారు విపరీత వ్యాఖ్యానాలను చేసినవారి తలపోతలను మాత్రమే యిచట పేర్కొని తగుజవాబు నీయ ప్రయత్నిస్తాము.

కమ్యూనిస్టు పార్టీనుండి ఎన్నడో వెళ్ళగొట్టబడిన, ప్రభుత్వ లేబరు సలహాదారు ఉద్యోగాన్ని స్వీకరించిన, నింబకర్ గాంధి ప్రారంభింపనున్న సత్యాగ్రహోద్యమాన్ని ఎదిరించడానికి తగిన సమయంలో నిషేధం తొలగించబడిందని అన్నాడు. ఇలాగే అనేకమంది ప్రభుత్వ ఉద్యోగులు, బ్రిటిషు సామ్రాజ్య వాదానికి ఏజంట్లు కమ్యూనిష్టులను కాంగ్రెసువీడి బయటికిరమ్మని సలహాలిస్తున్నారు. నిరంకుశాధికారును ప్రజల శ్రేయస్సుకు విరుద్ధమైన సమయంలో సాగించబడనున్న సత్యాగ్రహాల్ని సాకుగా తీసికొని, తక్కిన దేశభక్తులనుండి కాంగ్రెసును వేరు పరచి, అణచి వేయాలని కోరుతున్నారు.

ఒక వైపున ప్రభుత్వం కమ్యూనిష్టు ఖైదీలందరినీ యింకా వదలలేదు. ప్రతి కేసు విచారించబడుతూందని అర్థంలేని సాకులు చెబుతూ వుండి, మరొకవైపున నిరంకుశాధికారుల దౌర్జన్యం ప్రజలపై కొనసాగుతూనేవుంది. ఉదాహరణకు క్రిందటి వారంలో కాన్పూరు కార్మికులపై కాల్పులు జరిగాయి, చల్లపల్లి ఎస్టేటులో స్థానిక ప్రభుత్వోద్యోగులు నిరంతుశత్వంగా రైతులను, కూలీలను లాటీచార్జి చేయడం, బూతులు తిట్టడం జరిగాయి, అనగా ప్రభుత్వోద్యోగులు ప్రజలపైనిరంకుశత్వం చలాయించి ప్రజాయుద్ధానికి ఆటంకాలు కల్గించుతున్నారు. పైగా కమ్యూనిష్టులను తమ వినాశకరమైన కార్యాలకు, కాంగ్రెసువంటి దేశ పంస్థలను ఎదిరించాలని ఆహ్వానించుతున్నారు.

కాని కమ్యూనిష్టులు ప్రజలను యెప్పుడూ వీడరు. ప్రజా సంస్థల విచ్ఛిత్తానికి యెన్నడూ సాయపడరు. నిరంకుశాధికారుల దౌష్ట్యాలను యెల్లప్పుడూ యెదిరించుతారు. గాంధీజీ వుద్యమం వారు పనికిరాదనడానికి కారణం, అది భారత స్వాతంత్ర్యానికి మార్గం కాదని మాత్రమే. నిరంకుశాధికారుల హస్తాలను అది బలపరుస్తుందనియే. ప్రజలలో ఓటమి ఫలితంగా నిరుత్సాహాన్ని వ్యాపింపజేసి జపాన్ దుండగీడులకు వ్యతిరేకంగా జరగాలసిన ప్రజా ప్రతిఘటనను బలహీనపర్చడ మవుతుందనే

కొందరి అక్కసు

రెండోవైపున కాంగ్రెసు మితవాద నాయకులు, కాంగ్రెసు పత్రికలు కమ్యూనిష్టుపార్టీపై నిషేధాన్ని తొలగించినందుకు పరోక్షంగా అక్కసు వెళ్ళబోసుకుంటున్నారు. సామ్రాజ్యవాదులు తమ అధికారాన్ని వీశమైనా వీడ నిరాకరించినా, కమ్యూనిష్టులు ప్రజా యుద్ధమంటున్నారని ఆక్షేపించుతున్నారు. అందుకు కారణం వారికి రష్యాపై వున్న అభిమానము మాత్రమేకాని వాస్తవిక పరిస్థితులు కావని వి. వి. గిరి, వల్లభాయి పటేలు వగైరావాదు వాదించు తున్నారు. చక్రయ్య చెట్టియార్ రష్యన్ పార్టీగా కాక భారత జాతీయ పార్టీగానే తమ్ము పరిగణించుకోవాలని కమ్యూనిష్టులను హెచ్చరించాడు.

కమ్యూనిష్టులం యీ యుద్ధంలో భారత ప్రజలు పాల్గొని పోరాడి జయించుట ద్వారానే భారత స్వాతంత్ర్యం సాధ్యమవుతుందని విశ్వశించుతున్నాము. అంతే భారత దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా రష్యా కొరకు యుద్ధంలో పాల్గొనమనడం లేదు. అసలు భారత ప్రజలు ప్రయోజనాలు ప్రపంచ ప్రజల విజయం ద్వారానే సాధించబడుతాయి. ఫాసిస్టు దుండగీడులు జయించితే ప్రపంచ ప్రజలు దానిలో పాటు భారతీయులు దుర్భర దాస్యానికి గురి అవుతారు. అందుచేతనే జపాన్ దురాక్రమణదారులకు వ్యతిరేకంగా జరిగే యుద్ధంలో భారత ప్రజలు తమ స్వాతంత్ర్య సంపాదనకొరకే పాల్గొనాలి అంటున్నాము.

క్రిప్సు హెచ్చరిక

గాంధీజీ సత్యాగ్రహము ప్రయత్నాలను సాకుగా తీసుకొని సర్ స్టాఫర్డు క్రిప్స్ అమెరికా, బ్రిటను ప్రజలను మోసపుచ్చడానికి రేడియో ఉపన్యాస మిచ్చాడు దానిలో బ్రిటిషు ప్రభుత్వం యుద్ధానంతరం స్వాతంత్ర్య మివ్వ డానికి సిద్ధంగానే వుందనీ, ఇప్పుడు భారతీయులలో చీలికలు వుండుటచేతనే తాము ఏమీచేయలేక పోయామనీ వాదించాడు. తాము ప్రభుత్వాధికారాన్ని భారత జాతీయ ప్రభుత్వానికి ఇవ్వ నిరాకరించుటవల్లనే అలా జరిగిందనీ దాస్తున్నాడు, గాంధీ సత్యాగ్రహంచేస్తాననడం చూచి విభ్రాంతులయిన అమెరికన్ బ్రిటీషుప్రజల మోసపుచ్చ చూస్తున్నాడు.

కాని బ్రిటిషు కమ్యూనిష్టుపార్టి, అమెరికన్ పార్టీల నాయకత్వాన ప్రజలు భారతరాజ్యాంగ సమస్యను పరిష్కరించాలని ఒత్తిడి చేస్తున్నారు. న్యూరిపబ్లిక్ పత్రిక భారతదేశంలో బ్రిటిషు పాలన వుండాలనేవారు, డిమాక్రసీ పక్షాన పోరాడుతున్నామని చెప్పుకోజాలరని హెచ్చరించింది. ఇండియాలో ఐ. సి. యస్. ఉద్యోగిగా పనిచేసిన హెచ్. జె. బి. ఫిల్బి అను కన్సర్వెటివ్ కూడా యిలా వ్రాయక తప్పిందికాదు. "కాంగ్రెసు కోరుతున్నది అట్లాంటిక్ చార్టరుకు మించినదిగాలేదు. తూర్పు దేశాలు సంపూర్ణ స్వాతంత్ర్యం విదేశస్థుల నుండి సంపాదించాలని నిశ్చయించుకున్నాయి. మాటలలో మనం ఆసూత్రాలను అంగీకరించినా ఆచరణలో అమలు జరుపుటలేదు అని ఆక్షేపించాడు.

చైనా జాతీయ పత్రిక యిలా వ్రాసింది: "ఒక శతాబ్దంనుంచి స్వాతంత్ర్యం కొరకు భారత దేశం పోరాడుతుంది. నేడు పరిస్థితులు విషమావస్థకు వచ్చాయి.........బ్రిటను భారత ప్రజల వాంఛను నెరవేర్చి, వారి సహకారాన్ని పొందాలి. స్వాతంత్ర్యం కావాలనడం బ్రిటిషు వారికి విపరీత కోర్కెగా కనిపించవచ్చును. కాని ఆచరణలో అది వూహించలేనంత లాభాన్ని మనకు (మిత్రమండలికి) కల్గిస్తుంది,"

అని సలహా యిచ్చింది.

అలాంటి మిత్ర రాజ్యాల ప్రజల ఒత్తిడి సఫలీకృతం గాడానికి భారత కాంగ్రెసు నాయకులు తోడ్పడాలి. వినాశకరమైన సత్యాగ్రహం మాట వదలి జాతీయైక్యతకొరకు, కాంగ్రెసు-లీగ్ ఐక్యత కొరకు కృషి చేయాలి. జపాన్ దాడిని యెదిరించడానికి ప్రజలను సంఘటిత పరచాలి,

బోల్షివిక్ పోటీ

కామ్రేడ్స్,

పత్రిక ప్రారంభానికి ముందు మొదటి నెలలో వెయ్యిమంది చందాదారులను చేర్చాలని హెచ్చరించాము. కామ్రేడ్స్ ఉత్సాహంతో మొత్తం పూర్తి చేయగలిగినందులకు అభివందనాలు. కాని కొన్ని జిల్లాలు రాజకీయ చైతన్యాన్ని దృష్టిలో పెట్టుకొని చూచినా సమానంగా చేర్చలేదు. కృష్ణా తన కోటాను మించి పూర్తి చేసింది. గుంటూరు, నెల్లూరులు కోటాలు పూర్తిచేశాయి. కాని రాజకీయంగా ముందుకే వున్నప్పటికీ పశ్చిమ గోదావరి తన వంతు పూర్తి చేయలేదు, తూర్పు గోదావరి వెనుకబడిన జిల్లాల దశలోనే వుంది. ఆ జిల్లాలో డిపాజిట్లు కట్టకపోవుటచే విడి కాపీల యేజెన్సీలు రద్దు చేయబడుతాయి. కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం కామ్రేడ్స్ యింకా పట్టుదలతో కృషి చేయాలి.

మన పత్రిక స్వయం పోషకంగా వుండాలంటే 3 వేలు చందాదారులు కనీసముండాలి. ఇపుడు మనం 3 వేలు కాపీలు అచ్చు వేస్తున్నాము. అందులో 1167 మాత్రమే చందాదార్లు. తక్కినవి యేజెన్సీలద్వారా అమ్మబడుతున్నాయి. మూడు వేల చందాదారులు, రెండు వేలు విడి కాపీల అమ్మకం, మొత్తం 5 వేలు అచ్చువేస్తే యీ కాగితాల కరువు రోజులలో నష్టం లేకుండా నడుప గల్గుతాము. క్రింది పట్టికలో పార్టీ బలాన్నిబట్టి కోటాలు నిర్ణయించాము.

కామ్రేడ్స్ ! బోల్షివిక్ కాంపిటీషనుతో పనిచేయాలి. మీ కోటాలను మించి చేర్పించాలి. ఆంధ్ర దేశ మంతటా ప్రతి మారుమూలకు మన పత్రిక వ్యాపించునట్లు చూడాలి.

ఇట్లు,
ఆంధ్ర కమిటీ.

జిల్లా	చందా దారులు	విడి కాపీలు	మొత్తం	సంవత్సరంలో పూర్తి చేయవలసిన కోటా (చందా విడికాపీలు మొత్తం)
విశాఖపట్టణం	5	35	40	100
తూర్పుగోదావరి	7	186	193	250
పశ్చిమగోదావరి	90	230	320	600
కృష్ణా	687	504	1191	2000
గుంటూరు	212	963	608	1000
నెల్లూరు	124	126	250	500
చిత్తూరు	5	10	15	100
కడప	6	25	31	100
కర్నూల్	9	57	66	150
అనంతపురం	3	—	3	100
నైజాం	12	81	93	100
మద్రాసు	4	60	64	—
ఇతర రాష్ట్రాలు	3	32	35	—
	1167	1742	2909	5000

(5 వ పేజీ తరువాయి) దుకాణదారులు, ఉద్యోగస్తులు ఇదివరకు బర్మా దేశీయు లున్నచోట నేడు జపాను దేశస్థు లున్నారు. కాస్తో కూస్తో బర్మా భాష వచ్చిన వందల కొలది జపాను స్త్రీలు, బర్మా ప్రజలు ఇదివరకు చేస్తూవున్న టైపిష్టు మొదలగు పనులు నేడు తాము తీసుకున్నారు. ఒక్క మోల్మీన్ నగరంలోనే 700 మంది జపాను దుకాణదారులు తమ కుటుంబాలతో వచ్చి చేరారు,

భారత ప్రజలు యికనైనా జపానువారు మనకు స్వాతంత్ర్య మిస్తారనే తప్పుడు ప్రచారానికి లోనుగాక చైనా, సోవియటు, అమెరికా, బ్రిటిషు ప్రజలతోపాటు జర్మనీ జపానులకు వ్యతిరేకంగా యుద్ధంలో పాల్గొనాలి. అలా చేయడం వల్లనే మన శత్రువుల నిద్దరినీ ఒకే పర్యాయం తరిమివేయగలం.

పీపుల్సువార్ కోటాలు

వైజాగ్	10
తూర్పు గోదావరి	50
పశ్చిమ గోదావరి	50
కృష్ణా	100
గుంటూరు	100
నెల్లూరు	50
చిత్తూరు	20
కడప	10
అనంతపూర్	20
కర్నూల్	10
ఇతర ఆంధ్ర ప్రాంతాలు	30
	450

ఫాసిస్టు వ్యతిరేక-ప్రచారం

నెల్లూరు జిల్లా

11-7-43 తేదీ సాయంత్రం కామ్రేడ్స్ పి. నరసింహం, ఎ. రంగయ్య వగైరా ఫాసిస్టు వ్యతిరేక వూరేగింపుతో రామతీర్థం వెళ్ళి తిరునాళ్ళలో సభ జరిపారు. జపానుదాడిని ప్రతిఘటించుట ద్వారా భారతస్వాతంత్ర్యాన్ని సాధించాలని ప్రబోధం చేసారు.

• • •

12 తేదీ బి. శంకరయ్య వగైరా కామ్రేడ్స్ కూడా వచ్చి కలిసారు. ఐదు మీటింగులు జరుపబడ్డాయి. ఈ ప్రచారం యువకులలో కమ్యూనిస్టుల కార్యక్రమం యెడల సానుభూతి కలిగేలాగు చేసింది. సామాన్యజనంలో జపాన్‌దాడిని యెదుర్కొడానికి ప్రజా ఐక్యత కావాలనే భావం కలిగించింది.

• • •

ఆత్మకూరు తాలూకాలో కామ్రేడ్ జి. సి. కొండయ్య 17 వ తేదీ బయలుదేరి సూరాయపాలెం, తాటిపర్తి గ్రామాలలో ఫాసిస్టు వ్యతిరేక సభలు జరిపారు. వానిలో జపాన్ దుండగీడుల నెందుకు ఎదిరించాలో వివరించారు.

• • •

18 వ తేదీ అమ్మోయపాలెం, నావూరు గ్రామాలలో సభలు జరుపబడ్డాయి. 19 వ తేదీ పాలెం, చెన్నారెడ్డివల్లెలలో సభలు జరిగాయి. జపాన్ దాడిని ఎదిరించాలి. జాతీయ ప్రభుత్వాన్ని సాధించాలి అనే నినాదాలు యివ్వబడినాయి. 21 వ తేదీ కంభంపాటి గ్రామంలో రైతుసంఘ కార్యదర్శి యం. శంకరయ్యగారి అధ్యక్షతను సభ జరిగింది. మరునాడు నల్లపరెడ్డిపల్లెలో ప్రచారం చేయబడింది. ఈ తాలూకాలో జయప్రదంగా ప్రచారం జరిగింది. ప్రజలలో వున్న సందేహాలు తొలగించబడ్డాయి.

• • •

21 వ తేదీ గూడూరులో కార్మికుల యాజమాన్యాన బహిరంగసభ జరిగింది. కామ్రేడ్ కె. కృష్ణారావుగారు ప్రజాయుద్ధ పాలసీని గురించి ఉపన్యసించారు. కాంగ్రెసువాదుల సందేహాలకు సమాధానాలు యివ్వబడినాయి. పీపుల్సువార్, ప్రజాశక్తి పత్రికలకు చందాదారులను చేర్పించారు.

పుంగనూరు
(చిత్తూరు జిల్లా)

పుంగనూరు యువజనసంఘంవారు 18-7-41 సాయంత్రం జపాన్ వ్యతిరేక మహాసభను కామ్రేడ్ జి. సీతారామయ్య అధ్యక్షతను జంపారు.

అధ్యక్షులు, ప్రారంభకులైన కె. కాశేశ్వరరావుగారు, జనాబ్ మురాద్ బేగ్ గారు జపాన్ దాడుల నుంచి భారతప్రజలను ఎట్లు రక్షించవలసినది తెల్పారు. సంయుక్త ప్రజారక్షణ సంఘాలను, వాలంటీరు దళాలను ఏర్పర్చాలని కాంగ్రెసు లీగు ఏకమయి జాతీయప్రభుత్వాన్ని సాధించాలనీ తెల్పారు. జపాన్‌దాడిని ఎదిరించుట ద్వారానే నేడు స్వాతంత్ర్య సంపాదన సాధ్యమవుతుందని నచ్చచెప్పిరి. సభకు హాజరయిన హిందువులు - ముస్లిములు కూడ చాల శ్రద్ధగా వినిరి.

పొన్నెకల్లు

ది 24-7-42 తేదీన పొన్నెకల్లు గ్రామంలో భారతకమ్యూనిష్టుపార్టీపై నిషేధం తొలగించిన సందర్భంలో, యువజనసంఘ ఆధ్వర్యంక్రింద కమ్యూనిష్టు పార్టీకి జై, ప్రపంచప్రజల స్వాతంత్ర్యానికి జై, అనే నినాదాలతో వూరేగింపు జరిపి బహిరంగసభ జరుపబడెను.

సభకు అధ్యక్షులు కామ్రేడ్ గుర్రం వెంకటసుబ్బయ్యగారు, కామ్రేడ్ గుర్రం కోటయ్య కమ్యూనిస్టుపార్టీ ఆశయాలను గురించి మాట్లాడారు.

తీర్మానాలు

(1) పూజే. గోపాల్‌నంబియార్, జొన్నలగడ్డ రామలింగయ్య గార్లను ఎట్టి విచారణ లేకుండా విడుదల చేయాలనిన్నీ పి. వి. శివయ్య మొదలైనవార్లపై నిషేధం తొలిగించాలి.

బాపట్ల

బాపట్ల తాలూకా యువజనసంఘ కార్య నిర్వాహక సమావేశం బాపట్లలో సమావేశమయి కమ్యూనిస్టుపార్టీపై నిషేధం తొలగించినా ఇంకా చాలమందిని డిటిన్యూలగా ఉంచడాన్ని గర్హించుతూ తీర్మానించింది.

కాకినాడ

జూలై 24 భారతకమ్యూనిస్టుపార్టీపై నిషేధం తొలగినందులకు బసివిరెడ్డిగారి మేడవద్ద సభ జరిగింది. కామ్రేడ్ కె. వెంకటావు గారు అధ్యక్షత వహించారు. కమ్యూనిస్టుపార్టీ ఆశయాల గురించి కామ్రేడ్స్ పి. జగదాంబ డి. సురేంద్ర, ఎమ్. పట్టాభిరామయ్య, సి. హెచ్. బాలకృష్ణ, కె. అప్పారావు, ఆర్. చిన్నగార్లు ఉపన్యసించిరి.

బ్రిటను, అమెరికా భారతదేశ ప్రజల ఒత్తిడిచే పార్టీపై నిషేధం తొలగినందులకు వారిని అభినందించుచూ, ప్రభుత్వం కమ్యూనిస్టు ఖైదీల నందరిని తక్షణమే విడిచి, కొందరిపై నున్న ఆంక్షలను తొలగించి ఫాసిస్టువ్యతిరేక పోరాటాన్ని బలపర్చవలసిందనిన్నీ, చల్లపల్లి ఎస్టేటులోని ముఠాసుల పోరాటంలో అరెస్టయిన కామ్రేడ్ చండ్ర రాజేశ్వరావుగారిని తదితరులను వెంటనే విడిచి న్యాయం కలుగ జేయవలసిందనిన్నీ ప్రభుత్వాన్ని కోరుచూ తీర్మానించిరి.

గుంటూరు

ది 24—7—42 న భారతకమ్యూస్టుపార్టీ యొక్క గుంటూరు జిల్లా, టవున్ కమిటీల యాజమాన్యాన కమ్యూనిస్టుపార్టీపై నిషేధం తొలగిన సందర్భములో మీటింగులు జరిగాయి. మూడువందలమంది యువకులు, విద్యార్థులు, కమ్యూనిస్టుపార్టీకి జై అనే నినాదములతో ఊరేగింపు జరిపారు. స్వరాజ్యమైదానంలో మహాసభ జరిగింది. కామ్రేడ్ అన్నాప్రగద కామేశ్వరరావుగారు అధ్యక్షత వహించారు. కామ్రేడ్స్ మోటూరు హనుమంతరావు కంభంపాటి శ్రీరామమూర్తి, వాసిరెడ్డి శివలింగప్రసాద్, యం. రాధాకృష్ణగార్లు భారతకమ్యూనిస్టుపార్టీ చరిత్రను అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీ శాంతికై పోరాడిన వీరు, భారతజాతీయ కర్తవ్యములను గురించి విపులీకరించారు. 200 మంది ప్రజలు సభకు హాజరయ్యారు. జయజయధ్వనులతో కమ్యూనిస్టుపార్టీకి జై అనే నినాదములు మిన్నుముట్టుచుండగా సభ ముగిసింది.

బెజవాడ

ఫార్వర్డు బ్లాకు సభ్యుల యిండ్ల సోదాలతో పాటు పోలీసులు తన యింటిని సోదా చేశారనీ తాను యేడాది క్రిందటనే ఫార్వర్డు బ్లాకుతో సంబంధం త్రెంచుకున్నాననీ, ప్రజా యుద్ధ పాలసీని పూర్తిగా అంగీకరించు తున్నాననీ తెలుపుతూ గర్రె సత్యనారాయణగారు స్టేటుమెంటును పంపారు.

కోట నందూరు

తుని తాలూకాలో అల్లిపూడి గ్రామములో 15-7-42 తేదీని, కోటనందూరులో 16-7-42 తేదీని కామ్రేడ్సు యినుగంటి నారాయణరావు, కంభంపాటి సత్యనారాయణ, గారలు ఫాసిస్టు వ్యతిరేక బహిరంగ సభలు జరిపి, ప్రస్తుత అంతర్జాతీయ స్థితిగతులను గురించి, జపాను-జర్మనీ ఫాసిస్టు దురాక్రమణ వల్ల భారత దేశానికి కలుగబోవు ముప్పును గురించి ఉపన్యసించిరి. నాజీ జర్మనీ సోవియటు రష్యాపై దాడి సలిపిన రోజు మొదలు యుద్ధపు స్వభావం మారినదనియు, ప్రపంచమందలి ప్రజ లందరు ఫాసిస్టు దురాక్రమణను యెదుర్కొనకపోతే భయంకర పరిపాలనా విధానమే గతి యగుననియు, సభలలో విశదీకరించిరి. బ్రిటిషు ప్రభుత్వం వెంటనే ఆయుధ చట్టాన్ని రద్దు గావించ వలయుననియు, వివిధ జైళ్ళయందలి ఫాసిస్టు వ్యతిరేక డిటెన్యూలను, రాజకీయ ఖైదీలను విడుదల చెయ్యాలనియు, ప్రజలు ప్రజా రక్షణ సంఘాలు స్థాపించుకొని, ఫాసిస్టు దాడిని యెదుర్కొనాలనియు. రష్యా - చైనా ప్రజలు యీ యుద్ధంలో ప్రదర్శిస్తున్న ధైర్య సాహసములను ప్రజలు అభినందించు చున్నారనియు, ఫాసిస్టు దురాక్రమణను యెదుర్కొనుటకై ప్రజలు తమ నిశ్చయాన్ని ప్రకటించు చున్నారనియు తీర్మానములు పై సభలలో యేకగ్రీవంగా ఆమోదించబడెను.

10 వ పేజీ తరువాయి)

గాంధీజం ఎచటికి దారితీస్తుంది ?

కాంగ్రెసు వాదులను దేశభక్తులను, స్వాతంత్ర్య కాంక్షితులను మేము ఒకటి ప్రశ్నించుతాము: మీరు వీరుల కుచితమైన కమ్యూనిష్టుల పంధాను అనుసరించి మాతృదేశాన్ని రక్షించుకొని స్వాతంత్ర్యాన్ని సాధించుతారా? లేక జపాను దండయాత్రవల్ల యింతకన్న మనం చెడేది ఏమీ లేదనే భ్రమలోపడి దేశ ద్రోహులకు సాయపడుతారా? ఈ మార్గం అనుసరించడం వలన స్వాతంత్ర్యం రాదు సరిగదా ? జపాను క్రింద దుర్భర దాస్యం వస్తుంది. చైనా చరిత్రను పరికించి చూస్తే యీ సత్యం మీకే బోధపడుతుంది.

దేశ భక్తు లందరూ క్రమంగా తప్పక కమ్యూనిష్టులు సూచించే వీరోచిత మార్గాన్నే అనుసరించుతారని ఆశించుతాము. లీగ్-కాంగ్రెసు ఐక్యతకై కృషిచేసి తద్వారా జాతీయైక్యతను సాధించి బ్రిటిషు ప్రభుత్వమునుంచి జాతీయ ప్రభుత్వాన్ని గుంజుకోవాలని కోరుతాము. దేశ రక్షణ కార్యాలలో పాల్గొని జపాన్ దుండగీడులకు వ్యతిరేకంగా భారత ప్రజలను సమీకరించుతారనీ ఆశించుతాము. ఇదొకటే నేడు భారత స్వాతంత్ర్యానికి మార్గం. మరే పంథా అవలంభించినా ప్రపంచ ప్రజలకు విద్రోహ మొనర్చినవార మౌతాం. ఫాసిస్టు దుండగీడు లకు సాయ మొనర్చినవార మౌతాం, భారత ప్రజల స్వాతంత్ర్యానికి ద్రోహ మొనర్చినవార మగుతాము, గాంధీయులు ఈ సత్యాగ్రహాన్ని గుర్తించాలని మా ప్రార్థన.

(2 వ పేజీ తరువాయి)

కయ్యూరు 'దే' జరపండి !

చేసిన పోలీసు పన్నాగాల ఫలితంగా నలుగురు కమ్యూనిష్టులు రైతు సేవకులు నేడు ఉరికంబాలు ఎక్కవలసి వస్తూంది.

ఈ ఘటనలు సామ్రాజ్యవాద యుద్ధ కాలపు నాటివి. అప్పుడు జపాను దాడి భయం భారత దేశానికి లేదు. ఇప్పుడు జపాను దాడి యే నిమిషంలోనైన జరుగవచ్చును. మన ప్రజలందరిని యేకమొనర్చి జపాను వ్యతిరేక యుద్ధంలో దింపడానికి కమ్యూనిష్టులు అహోరాత్రాలు పని చేస్తున్నారు. ఆ సంగతి గుర్తించి ప్రభుత్వం కూడా జపాను వ్యతిరేక కార్యక్రమాన్ని తీవ్రంగా సాగించే అవకాశ మివ్వడానికి కమ్యూనిష్టు పార్టీపై నిషేధం తొలగించింది. అట్టి పరిస్థితులలో జపాను ఫాసిస్టులతో ఢీకొని ప్రాణాలివ్వడానికి పూనుకున్న కమ్యూనిష్టులను వురి కంబాలపై వ్రేలాడదీయడం ప్రభుత్వానికి తగదు. అంతేకాదు. రైతు సేవకులగు ఆ నల్గురు కమ్యూనిష్టులను వురి దీయడం భారత ప్రజలలో ముఖ్యముగా మలబారు ప్రజలలో తీవ్ర ద్వేషానలాన్ని రగుల్కొల్పుతుంది, జపాను వ్యతిరేక యుద్ధ ప్రయత్నాలకు తీవ్రమైన ఆటంకం కలుగుతుంది.

ఆ నల్గురు రైతు సేవకులను ఉరి కంబాలనుండి మనం కాపాడాలి. దేశ మంతటా గ్రామ గ్రామాన సభలు గావించి, ప్రజలు కయ్యూరు శిక్షితులపై మరణ శిక్ష రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానాలు చేయాలి. వేలకొలది ప్రజలచే సంతకాలు చేయించి మహజర్లు గవర్నరుకు పంపాలి.

ఆంధ్ర దేశ మంతటా కయ్యూరు దే ఆగష్టు 3 వ తేదీ జరపాలి.

కయ్యూరు మరణ శిక్షలు రద్దు కావాలి!

ఏజెంట్లకు

ఎక్కువ కాపీలు కావలసినా, తగ్గించవలసి వచ్చినా శనివారం నాటికి ఆఫీసుకు తెలియజేయాలి. లేనిచో మార్పుచేయబడదు.

—మేనేజరు

యు వ జ ను లు - వి ద్యా ర్థు లు

కొటూరు యువజన రైతు సంఘాల యాజమాన్యాన బహిరంగ సభజరిగింది. 600 మంది సభకు వచ్చారు. ఫాసిస్టు వ్యతిరేక రాజకీయ ఖైదీలను విడుదల గావించాలని తీర్మానించారు.

• • •

నర్సారావుపేట పట్టణ యువజన సంఘ యాజమాన్యమున జులై 12 వ తేదీన బహిరంగసభజరిగింది. ఫాసిస్టు వ్యతిరేక రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని తీర్మానించబడింది. నర్సారావు పేట పట్టణ యువజన సంఘం, చౌకఅంగళ్ల ఆందోళన కొరకు ప్రచారము కొరకు ఒక కమిటీని వేసింది.

• • •

పిడుగురాళ్లలో 9-7-42 వ తేదీన చైనాస్వాతంత్ర్య దినోత్సవము జరిగింది. ఊరేగింపు తర్వాత పెద్దబహిరంగ సభ జరిగింది. చైనాకు సానుభూతి తెల్పుచూ, చైనావలే జపానును భారతీయులు ఎదుర్కొనవలెనని ఉపన్యాసకులుఉద్బోధించారు.

• • •

సంగం జాగర్లమూడిలో గ్రామ యువజన సంఘమూ, పసుమర్రులో విద్యార్థి సంఘమూ క్రొత్తగా ఏర్పడినయి.

• • •

పామర్రు విద్యార్థి సంఘ సాధారణ సభ్యులు నూతన సంవత్సరానికి కార్యనిర్వాహకవర్గాన్ని ఎన్నుకొన్నారు. ఆగస్టు 20, 21 వ తేదీలలో జరుగనున్న జిల్లావిద్యార్థి మహాసభకు బి. సోమిరెడ్డిగారి అధ్యక్షతను ఆహ్వాన సంఘం ఏర్పడింది.

• • •

యస్. టి. రంగాచారిగారి అధ్యక్షతను గుంటూరు పట్టణవిద్యార్థి మహాసభకు ఆహ్వాన సంఘమేర్పడినది. మహాసభకు డాక్టర్ కె. బి. కృష్ణ. గంగాధరరావు, తాపీధర్మారావు, ప్రొఫసర్ యం. వెంకట రంగయ్యగారలు ఆహ్వానింప బడ్డారు.

• • •

రేపల్లె తాలూకా యువజన సంఘ ఆఫీసు రేపల్లెకు మార్చబడినది. ప్రతిగ్రామ యువజన సంఘమూ 20 వ తేది కల్లా రిపోర్టు చేయవలసిందని, జాతీయ ప్రభుత్వ స్థాపనకు యువకులంతా కృషిచేయాలని తా. యు. కార్యనిర్వాహక వర్గం 11-7-42 న తీర్మానించింది.

• • •

ఒంగోలు తా. యువజన సంఘ కార్యనిర్వాహక వర్గం 15-6-42 సమావేశమైనది.

గాంధిజీ తేనున్న ఉద్యమం భారతదేశ స్వాతంత్ర్యానికి హానికరమని. వచ్చే ఎ. ఐ. సి. లో ఫాసిస్టు వ్యతిరేక ప్రజాయైక్య సంఘమునకు కాంగ్రెసు కృషి చేయాలని ఈ సంఘం కోరుచున్నది.

ఫాసిస్టు వ్యతిరేక రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని తీర్మానించింది.

వర్షాలు లేక పోవడం వల్ల అధిక ధరల వల్ల ఏర్పడిన కరువు పరిస్థితులను ఎదుర్కొనటానికి ప్రభుత్వం ఈ క్రింది వాటిని చేయవలెనని సంఘం కోరుచున్నది.

(అ) ప్రతి 5, 6. గ్రామాలకు ఒక కూడలి ఏర్పాటు చేసి ముఖ్య గ్రామంలో ఒక కోపరేటివ్ స్టోర్సు పెట్టి ప్రజా సామాన్యానికి కావలసిన తిను బండారములు మొదలగునవి లాభాలులేకుండ అసలు ధరలకే అమ్మించాలి.

(ఆ) గవర్నమెంటు ఏర్పరచిన నిర్ణీత ధరలకు వర్తకులు వస్తువులు అమ్మునట్లు చేయాలి. ఆవస్తువుల నిర్ణీత ధరలను ప్రజలలో చాటింపు ద్వారా బాగా ప్రచారము గావించాలి.

(ఇ) బంజరు భూములన్ని కూలీలకు, బీద రైతులకే ఇవ్వాలి.

(ఈ) గవర్నమెంటు పంచాయితి బోర్డుల ద్వారా గ్రామ సౌకర్యాలను (చెరువులు భావులు త్రవ్వించుట. రోడ్లు వేయించుటకు మొదలయినవన్నీ) చేయించుటకు మొదలు పెట్టి ప్రస్తుతము కూలీలలో ఏర్పడ్డ నిరుద్యోగాన్ని పోగొట్టాలి.

(ఉ) ఇదివఱకు ప్లాను వేసి పనిసాగించకుండ ఉండిన రాపర్ల కాలువస్కీముము ప్రభుత్వం వెంటనే మొదలు పెట్టి, తాలూకాలో ఏర్పడ్డ దుర్భరపరిస్థితులను పోగొట్టాలి. దీని వలన వందల కొలది కూలీలకు వెంటనే జీవన మేర్పడు తుంది కాలువ పూర్తి అయిన తరువాత ఆహార పదార్థములు ఎక్కువఉత్పత్తి చేయుఉద్యమము బాగా సాగుతుంది,

(ఊ) ఉప్పు కూలీలు తాముపండించు కొన్న ఉప్పును ఎంతదూరమైన పోయి అమ్ముకొనుటకు వీలుండునట్లు ఇది వఱకున్న నిర్బంధమును తొలిగించాలి.

గుడివాడ తాలూకా యువజన సంఘం.

గుడివాడ తాలూకా యువజన సంఘ కార్య నిర్వాహక వర్గసమావేశం 17-7-42 న సమావేశమైనది. ఈ దిగువ తీర్మానములను ఏకగ్రీవముగా అమోదించడమైనది.

(1) గ్రామ యువజనసంఘ కార్యదర్శులకు యువజనసంఘ కార్యక్రమము అమలుపరచుటలోనూ, ఆఫీసు నిర్వహణలోనూ శిక్షణయిప్పించుటకు ఫిర్కాలవారీగా ఒక్కొక్క ఫిర్కాలో 3 దినముల చొప్పున శిక్షణా శిబిరములు నడుపుటకు తీర్మానించింది.

(2) డిటెన్యూలను విడుదల చేయవలసినదిగా అన్ని గ్రామ సంఘాలూ, 1 వ తేదీలోగా ఆందోళన చేయవలెననియూ అందుకుగాను మహజర్లు తాలూకా సంఘం వారు అచ్చువేయించి యిచ్చుటకు తీర్మానించింది.

సత్తెనపల్లి తాలూకా రెండవ యువజన మహాసభ

ద్వితీయ యువజన మహాసభ 11, 12, తేదీలలోఫణిదంలో అత్యుత్సాహంగాజరిగింది. 40 గ్రామాలనుండి 300 లకు పైగా యువకులు విచ్చేశారు, 100 మంది ప్రతినిధులు, ఆటలు. సంగీతం, వక్తృత్వములలో పోటీలు జరిగాయి, బుర్రకథ గోషాయి పాటలు పార్టీద్రిస్సులు వేశారు, యువకులలో నూతనోత్సాహం వెల్లివిరిసింది. గ్రామస్తులును, పరిసర ప్రాంతాలనుండి 3000 లకుపైగా పాల్గొని యువకనాయకుల మహోపన్యాశాలు శ్రద్ధగా విన్నారు సంగీతం, స్పోర్ట్సు, కళలు, వివిధ అభిరుచులు గలిగిన యువకులందరిని మహాసభ ఆకర్షించింది.

మద్యాహ్నము డెలిగేట్సు క్యాంపులో జరిగింది. యల్. బి. గంగాధరరావు గారు, గ్రంధాలయాలు, డిబేట్సు, రాత్రి పాఠశాలలు సాంఘిక రాజకీయ ప్రజాసేవ వైజ్ఞానిక శారీరక కళాభివృద్ధి మున్నగు యువజన సంఘ కార్యక్రమాన్ని అంతా వివరించారు. తీర్మానాన్ని చర్చించి నిర్ణయించు కున్నారు. తాలూకా కమిటీని యెన్నుకొన్నారు,

ఊ రే గిం పు

సభా పెండాల్‌నుంచి 300 మందితోబారులు తీరి స్త్రీవాలంటీర్లు ముందునడువ, బ్రహ్మాండమైన ఊరేగింపు జరిగింది. గ్రామమంతా నినాదాలతో మారు మ్రోగింది.

మ హా స భ

6 గం. చక్కగా అమర్చబడిన చలువ పందిరిలో కామ్రేడు శివలింగప్రసాదు అధ్యక్షతను జరిగింది, 3000 హాజరు అయినారు. శ్రీ మోర్తల అమరా రెడ్డిగారు యువక నాయకులయెరుక పరుస్తూ ప్రతినిధులకు ప్రేక్షకులకు సుస్వాగతము ఇచ్చారు, అధ్యక్షులు వివిధదేశాల యువజనోద్యమాలగూర్చి, దుర్భా కృష్ణమూర్తి శిక్షత వాలంటీర్ల దళాలగూర్చి గంగాధరరావు, యువజన సంఘకార్య కలాపాన్ని గూర్చి మల్లిఖార్జున శర్మగారు రష్యా సాధించిన ఘనకార్యాలున్ను, జపాను ఫాసిస్టు వ్యతిరేకాన్ని గూర్చి, నాశం బసవమ్మ, మోటూరి ఉదయం గార్లు జర్మనీ జపాను ఆక్రమితదేశాల్లో స్త్రీల దురవస్థగూర్చి వేరు వేరు సమస్యలపై చక్కని ఉపన్యాసా లిచ్చారు. ఉపన్యాసా లన్నిటిలో జపాను, జర్మనీ ఫాసిస్టు రాక్షసుల నెదుర్కొనుటలోనే మన భారత స్వాతంత్రోద్యమము ఆధారపడి ఉందని దేశరక్షణకు మనమె బాధ్యత వహించాలని ఉద్బోధించారు. సత్తెనపల్లి డిమాన్‌స్ట్రేటరు పంటల అభివృద్ధినిగూర్చి తెలియజేశారు. వావిలాల వీరభద్రరావు గారు తాలూకా జపాను వ్యతిరేకమును గూర్చి చెప్పి విద్యార్థులుగా రమ్మంటూ ఆహ్వానించారు. చివరకు పూదల వీరభద్రరావు అత్యంతోత్సాహమునకు జగిన నిర్మాణముండాలని వెంటనే యువకుల కర్తవ్యాన్ని గూర్చి హెచ్చరించారు. అధ్యక్షులు పోటీలలో గెలిచిన వారికి బహుమతు లిచ్చారు. ఫాసిస్టు వ్యతిరేక జయ ధ్వనులతో సభముగిసింది.

డిటిన్యూల విడుదల సందర్భంలో ప్రత్యేక సభ జరిపారు. రాత్రిశాస్త్రూరు యువజన సంఘ ముతరపున రామకోటేశ్వరరావు, మీరా, సత్యముగార్ల సెట్టుచే రష్యా జర్మనీ యుద్ధము బుర్రకథ చెప్పబడ్డది. స్థానిక పెద్దల సహకారములభించింది. 250 మంది స్త్రీలు కూడా ఉత్సాహంతో సభకు వచ్చారు. అచ్చం పేట నుండి నెహ్రూ స్కౌటు గ్రూపువచ్చి సేవ చేశారు. గుంటూరు వల్నాడు తాలూకాలనుండి 30 మంది యువకమిత్రులు వచ్చి సభకు వన్నె తెచ్చారు, తమ ఉత్సాహాతిశయాలు వెలిబుచ్చారు. జిల్లామహిళా క్యాంపుకు రు 15 లు మహిళా కామ్రేడ్సు వసూలు చేశారు. ప్రజాశక్తి కిచందాదార్లను చేర్పించారు.

తాలూకా యువజన సంఘం:-

(1) పూదోట రాజయ్యగారు, అధ్యక్షులుగా

(2) ఆమంచి నరసింహారావు కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు.

అంతిమ ఘడియ

(3 వ పేజీ తరువాయి)

యుద్ధం — బహుశ చావుగూడా — సమీపిస్తున్నందువల్ల దూరదృష్టి గలవాని నేత్రాల్తో రాత్రింతా పరికిస్తున్నా. కొన్ని రాత్రిళ్లూ, రోజులూ, నెలలూ ముందు—భవిష్యత్తుచూస్తున్నా. విషాదపర్వతాలపై విజయ పతాకం కన్పిస్తోంది. మేందానిని చేపడతాం. రక్త ధారల్లో, హింసా వాహినిలో, కష్ట ప్రవాహాలలో, భీకర సంగ్రామ సంద్రంలో పడి విజయ మనే రోడ్డుకుచేరుకుంటాము. శత్రువుపై సంపూర్ణ విజయానికి — అంతిమ విజయానికి — ఎన్నో కష్టాలు సహించాం. గెలుపొందుతాం,

యుద్ధానికి పూర్వపు సంవత్సరాలు కూడా స్మరించుకో, మన తరంలో యెప్పుడూ సంగ్రామపుచూరకత్తి మననెత్తిపైవ్రారిగేవుంది. ఐనా మనం జీవించాం. శ్రమపడ్డాం. సభలపై శ్రద్ధ వహించాం పిల్లలపెంచాం. నిమిషం ఏమరుపాటులేదు, మన సరిహద్దుల్లో ఒక అడవి జంతువు ఆయత్తపడుతోంది. కత్తి నూరుతూ కాలు దువ్వుతూవుంది. నిత్యం యుద్ధం మన పొరిగింటి పెద్దమ్మ, ఆ సర్పం మన జీవితాలకూ, శ్రమకూ, ప్రేమకూ విషమూది కల్మషం చేసింది. ఎన్నడూ మనకు సుఖనిద్రింటూ లేదు. మనం ఓపికతోవున్నాం.

ఆ క్రూర మృగం మనపై కురికాడు. మన పవిత్ర భూమిపై కాలు పెట్టాడు. భీకర యుద్ధం చెలరేగింది. మారణయుద్ధం. రాజీలు అసంభవము. ఒకే ఒకమార్గంవుంది. హిట్లర్ మృగాన్ని ప్రతిఘటించి రూపుమాపటం. తుది ఫాసిస్టువరకూ తుడిచివేస్తేనే భయంకర స్వప్నాలు అదృశ్యమౌతాయి. అప్పుడే ప్రశాంతం — విజయానుగత ప్రశాంతం-చూస్తాం. కామ్రేడ్! అప్పుడే అడవుల్లో ఆకులు ఆహ్లాదంతో అల్లాడటం వింటాం, ప్రపంచమంతా - మానవ జాతంతా - పతనంనుండి బయటపడి సుఖంతో, సంతోషంతో నిట్టూర్పువిడుస్తుంది.

అప్పుడు విముక్తిపొందిన. పట్టణాలూ, పల్లెలూ ప్రవేశిస్తూంటే ప్రశాంతం - విజయోత్సాహంతో పొంగిపొర్లే హృదయాల ప్రశాంతం - మమ్మాహ్వానిస్తుంది. అప్పుడే పునర్నిర్మిత ఫ్యాక్టరీల్నుండి పొగలేస్తుంది, అంతా జీవం పోసుకుంటుంది.

కామ్రేడ్! ఉన్నత జీవితం. ప్రజలందరి సౌభ్రాతృత్వంతో గూడిన స్వేచ్ఛా ప్రపంచంలో ఉత్కృష్టమైన, విలువైన జీవితం. ఆ జీవితం కొరకు ప్రాణత్యాగం మించినత్యాగం అనిపించుకోదు, ఆ చావు చావుగాదు. అమరత్వం.

కామ్రేడ్! తెల్లవారుతోంది, కనుచీకటిగా వుంది. జీవితం యీ సమయంలోవున్నంత సౌందర్యంగా ఎన్నడూలేదు. చూడు! డాజా మైదానం ఎంత కళకళలాడుతుందో! సూర్యరశ్మిలో చలువరాతి కొండలు ఎంత తళతళలాడుతున్నాయో చూడు!

ఔను జీవితం అనుభవించ గలిగింది. విజయసాధన కళ్లారచూడటం! నాకోటు మడతల్లోకి నాచిట్టికూతురు జిర్రతలహత్తుకోపటం!

బ్రతకడం నాకుచాలా యిష్టం - అందుకే నేయుద్ధానికి పోతున్నా. జీవితంకోసం పోరాటానికే, పోతున్నా, కామ్రేడ్! సుఖజీవితం కొరకేగాని బానిసబ్రతుక్కిగాదు. నాబిడ్డల సౌకర్యానికీ, నాజీవిత సౌఖ్యానికీ, కాని చావుకు భయపట్టంలేదు. శౌర్యంతో బ్రతకటం - శౌర్యంతో చావటం; నేజీవితాన్నర్థం చేసుకుందింతే,

తెల్లవారింది ....

మరఫిరంగులు మోగుతున్నాయి, యంత్రదళా లాయత్తమౌతున్నాయి, ఒక క్షణంలో మేంగూడాదూకుతాం,

కామ్రేడ్! నా జన్మభూమి డాజా ప్రాంతం మీద భానుడుదయిస్తున్నాడు. సమరభానుడు. ఆదిత్యకిరణాల్లోనే దృఢవిశ్వాసంతో ప్రతినబడుతున్నా. కామ్రేడ్! ద్రోహంచెయ్యను, గాయపడా సైన్యాన్ని విడిచిపెట్టను, శత్రువుచే చుట్టుముట్టబడ్డా చేతులెత్తను. ఆయుధం వదలను. నాకు అదురూబెదురూలేదు. శత్రువంటే వాళ్ళు చెమటలుపొయ్యదు, పగమాత్రమే. త్రాచుపగ, హృదయమంతపిస్తోంది. చావుబ్రతుకుల సమరం.

—"న్యూమాసెస్ నుండి"

END OF ISSUE